ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:118 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 19-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

నాగార్జునసాగర్ తెలంగాణకు
జీవనాడి అంటరు...
ఆ జీవనాడికే గండి కొట్టే ప్రయత్నాలు
జరుగుతున్నాయనే వార్తలు వస్తుంటే
చూస్తూ ఊరుకోవాలా?
అటు ఏపీ సర్కారు అడుగడుగునా
గండికొడుతుంటే..
డెడ్‌స్టోరేజ్ నీళ్లను సైతం వదలకుండా,
గుట్టుచప్పుడు కాకుండా సారంగాల
బాట పడుతుంటే.. తెలంగాణ నీటి
హక్కులు గాల్లో కలిసిపోతున్నాయి..
ఇది అభివృద్ధి కాదు.. తెలంగాణ నీటి
హక్కులపై దాడి.., ఇది నీటి తరలింపు
కాదు.. తెలంగాణ భవిష్యత్తుపై కుట్ర..
కృష్ణమ్మకు కూతవేటు దూరంలో
నా నల్లగొండ ఉన్నా..
తాగునీటికి తల్లడిల్లే పరిస్థితి ఎందుకు?
సాగునీటి కోసం రైతన్న ఆకాశం వైపు
చూసే దుస్థితి ఎందుకు? మన కళ్లముందే
నీళ్లు తరలిపోతుంటే అధికారుల
మౌనం ఎందుకు.? సారంగం తవ్వేది
మీ నేలలోనే.. కానీ గండి పడేది
తెలంగాణ గుండెల్లో....ఇదంతా
జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నరు?
ప్రభుత్వం ఏం చేస్తున్నది?
తెలంగాణ ప్రయోజనాలను
కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?
మా గొంతు ఎండిపోయాక
మేల్కొంటారా? మా పాలాలు
ఎండిపోయాక స్పందిస్తారా?
మా నీళ్లు తరలిపోయాక పోరాటం
చేస్తారా?
ఇప్పటికైనా పాలకులు మేల్కొనాలి..
అధికార యంత్రాంగం స్పందించాలి..
తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి...
ఇది రాజకీయాల సమయం
కాదు..తెలంగాణ నీటి హక్కుల
పరిరక్షణ సమయం..

జాజుల దినేష్
సామాజిక విశ్లేషకులు..నల్గొండ జిల్లా

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బ్రేక్

- కోర్టు తీర్పు వచ్చాకే ఈసీ నిర్ణయం!
- దానం నాగేందర్ అనర్హత వ్యవహారంతో ఉప ఎన్నికపై ఉత్కంఠ
- విజయారెడ్డి పిటిషన్‌పై హైకోర్టు తీర్పు కోసం ఎదురుచూపులు
- ఉప ఎన్నిక నిర్వహణపై స్పష్టత ఇచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- రంగంలోకి దిగిన బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి
- రెండో స్థానంలో ఉన్నవారికి ఎమ్మెల్యే పదవి ఇవ్వడంపై అభ్యంతరం



ప్రజా వాయిస్, హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక ఎప్పుడు జరుగుతుంది? ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఇదే ఆసక్తికర చర్చగా మారింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఉప ఎన్నిక తప్పదని రాజకీయ వర్గాలు భావించాయి. ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు కూడా ప్రారంభించాయి. అయితే వరుసగా న్యాయస్థానాల్లో దాఖలవుతున్న పిటిషన్లతో ఉప ఎన్నిక వ్యవహారం కొత్త మలుపులు తిరుగుతోంది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై తీర్పు వచ్చే వరకు ఎన్నికల నిర్వహణపై ముందుకు వెళ్లలేమని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేయడంతో ఇప్పట్లో ఉప ఎన్నిక జరిగే అవకాశాలపై అనిశ్చితి నెలకొంది.

విజయారెడ్డి పిటిషన్‌తో కొత్త మలుపు

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పి. విజయారెడ్డి.. దానం నాగేందర్ ఎన్నికను సవాల్ చేస్తూ గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఎన్నికల పిటిషన్‌పై నిర్ణయం వెలువడే వరకు ఉప ఎన్నిక నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో హైకోర్టు విచారణ పూర్తయ్యే వరకు ఉప ఎన్నిక నిర్వహణపై నిర్ణయం తీసుకోలేమని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఒకవేళ దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని హైకోర్టు తీర్పు ఇస్తే, రెండో స్థానంలో నిలిచిన విజయారెడ్డిని నేరుగా ఎమ్మెల్యేగా ప్రకటించే

మిగతా 2లో

సీఎం రేవంత్‌కు రాజగోపాల్‌రెడ్డి అల్టిమేటం.. నిధులివ్వకుంటే కురుక్షేత్రమే!

- మునుగోడుకు నిధులు కేటాయించకుంటే మరో చరిత్ర సృష్టిస్తా
- ప్రభుత్వం పేదల కోసమే.. కాంట్రాక్టర్ల కోసం కాదు
- పెన్షన్లు వెంటనే రూ.5 వేలకు పెంచాలని డిమాండ్
- ఉన్న హైదరాబాద్‌కే దిక్కులేదు.. ఫ్యూచర్ సిటీ ఎందుకని ప్రశ్న
- రైతుబంధు నిజమైన రైతులకు, కౌలు రైతులకు అందించాలని సూచన



షీటీమ్స్ పేరుతో మాజీ ప్రియుడికి ఫేక్ నోటీసు

- యువతి నిర్వాకం!
- మాజీ ప్రియుడిపై పగతో నకిలీ నోటీసు సృష్టి
- స్నేహితుడి సహకారంతో షీటీమ్స్ పేరుతో బెదిరింపు
- అనుమానంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- సైఫాబాద్ పోలీసులకు షీటీమ్స్ ఫిర్యాదు
- నకిలీ నోటీసు తయారీపై పోలీసుల దర్యాప్తు

2 లో



హోటళ్లకు తరలుతున్న ఇంటి గ్యాస్

- అధికారుల అండతోనే అక్రమ దందా?
- గృహ వినియోగ సిలిండర్లను హోటళ్లకు మళ్లిస్తున్న వైనం
- ఏజెన్సీలే అక్రమ సరఫరాకు సహకరిస్తున్నాయన్న ఆరోపణలు
- కమర్షియల్ సిలిండర్ కంటే రూ.2,068 తక్కువ ధర
- వరంగల్ జిల్లాలో 2 వేలకుపైగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు
- బహిరంగంగా అక్రమ వినియోగం
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ?



ప్రజా వాయిస్, వరంగల్: వంటింట్లో ఉండాల్సిన గ్యాస్ సిలిండర్లు హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు తరలుతున్నాయి. గృహ అవసరాల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న డొమెస్టిక్ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ అక్రమ దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని గ్యాస్ ఏజెన్సీల్లోని సిబ్బంది సైతం ఈ వ్యవహారానికి సహకరిస్తున్నట్లు సమాచారం. కమర్షియల్ సిలిండర్ల ధరలు భారీగా పెరగడంతో హోటల్ నిర్వాహకులు తక్కువ ధరకు లభించే గృహ వినియోగ సిలిండర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా కొందరు ఏజెన్సీల నిర్వాహకులు అధిక ధరలకు డొమెస్టిక్ సిలిండర్లను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రూ.2 వేలకుపైగా ధర వ్యత్యాసం

పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాల తర్వాత గ్యాస్ ధరలు పెరగడంతో ఈ అక్రమ దందా మరింత ఊపందుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందిన వివరాల ప్రకారం డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.1,013 కాగా, కమర్షియల్ సిలిండర్ ధర రూ.3,081గా ఉంది. ఈ రెండింటి మధ్య రూ.2,068 వ్యత్యాసం ఉండటంతో హోటల్ వ్యాపారులు తమ పరిచయాల ద్వారా గృహ సిలిండర్లను తెప్పించుకుంటున్నట్లు సమాచారం. మరికొందరు గ్యాస్ ఏజెన్సీల్లోని సిబ్బంది తమకు తెలిసిన వారి పేర్లపై డొమెస్టిక్ సిలిండర్లు బుక్ చేసి హోటళ్లకు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా వినియోగం

గృహ అవసరాల కోసం కేటాయించిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం నిబంధనల ఉల్లంఘనే కాకుండా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో పెద్ద మొత్తంలో గ్యాస్ వినియోగం జరుగుతుంటుంది. ఇలాంటి చోట్ల నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించడం భద్రతాపరమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. మరోవైపు అక్రమ సరఫరా, అదనపు వసూళ్ల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వాటిల్లుతోంది.

కళ్లముందే దందా.. అధికారుల తనిఖీలేవీ?

నగరంలోని హోటళ్లు, రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్లలో గృహ వినియోగ సిలిండర్లు కనిపిస్తున్నాయని వినియోగదారుల మండలి ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. డొమెస్టిక్ సిలిండర్లను తక్కువ ధరకు వినియోగిస్తున్న వ్యాపారులు మాత్రం గ్యాస్ ధరలు పెరిగాయంటూ వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇంత బహిరంగంగా అక్రమ వినియోగం జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రూ.1.50 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పబ్లిక్ ప్రాసిక్యూటర్!

- పెద్దపల్లి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ అరెస్ట్
- తొలుత రూ.2 లక్షలు డిమాండ్
- చివరకు రూ.1.50 లక్షలకు ఒప్పందం
- హత్య కేసులో నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తానని లంచం డిమాండ్?
- సహకరించిన ప్రైవేట్ వ్యక్తి రాజయ్య కూడా ఏసీబీ అదుపులోకి
- కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు

2 లో

నిమ్స్ అక్రమాలపై ఏసీబీ విచారణ

- లక్ష్మీ భాస్కర్ వాంగ్మూలం నమోదు!
- టెండర్లు, కరోనా బెడ్ల కేటాయింపులపై అధికారుల ప్రశ్నలు
- బెడ్‌కు లక్ష రూపాయల వసూళ్ల ఆరోపణలపై ఆరా
- క్యాంటీన్, మెడికల్ షాపుల టెండర్లపై కీలక వివరాలు
- ప్లాట్ కొనుగోలుకు రూ.30 లక్షలు బదిలీ చేసినట్లు వెల్లడి
- గణేష్, అరుణ పేర్లతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై మౌనం

ప్రజా వాయిస్, హైదరాబాద్: నిమ్స్ ఆస్పత్రిలో టెండర్ల వ్యవహారం, కరోనా సమయంలో బెడ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్ నుంచి ఏసీబీ అధికారులు వాంగ్మూలం నమోదు చేశారు. ఆస్పత్రిలో క్యాంటీన్ నిర్వహణ, హౌస్‌కీపింగ్, మెడికల్ షాపులు, సెక్యూరిటీ తదితర సేవలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను తాను పర్యవేక్షించినట్లు ఆమె వెల్లడించినట్లు సమాచారం.



బెడ్ల కేటాయింపులపై ఏమన్నారంటే?

కరోనా సమయంలో బెడ్ల కేటాయింపుల్లో జరిగిన అక్రమాల గురించి తనకు తెలియదని లక్ష్మీ భాస్కర్ చెప్పినట్లు తెలుస్తోంది. బెడ్‌కు రూ.లక్ష వసూలు చేశారన్న ఆరోపణలపై ఏసీబీ ప్రశ్నించగా.. శగుణమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదులో తన పేరు లేదని, ప్రశాంత్ పేరు మాత్రమే ఉందని, అతనెవరో కూడా తనకు తెలియదని సమాధానమిచ్చినట్లు సమాచారం. కరోనా సమయంలో నోడల్ అధికారిగా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న బెడ్లు, వార్డుల్లోని పడకలు, వెంటిలేటర్ల సంఖ్యను మాత్రమే పర్యవేక్షించానని తెలిపినట్లు తెలుస్తోంది.రాజకీయ

మిగతా 2లో

మల్లమ్మకు డెత్ సర్టిఫికెట్.. నెల రోజులైనా కాకతీయ హాస్పిటల్‌పై చర్యలేవీ?

- గత నెల 22న డీఎంహెచ్‌ఓకు ప్రజా వాయిస్ ఫిర్యాదు
- విచారణ జరిగినా చర్యలు తీసుకోని అధికారులు?
- ఫిర్యాదుదారులకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న వైనం
- ప్రైవేట్ ఆస్పత్రి వ్యవహారంపై అధికారుల మౌనం ఎందుకు?
- కలెక్టర్, ఆరోగ్య మంత్రి జోక్యం చేసుకోవాలని ప్రజా వాయిస్ డిమాండ్

2 లో



నాగార్జున సాగర్‌పై ఏపీ టన్నెల్.. తెలంగాణ సర్కారుపై కవిత ఫైర్!

- రేవంత్ అనుమతితోనే పనులు జరుగుతున్నాయా? అని ప్రశ్న
- రాష్ట్ర నిఘా వ్యవస్థ ఏం చేస్తోందంటూ నిలదీత
- ప్రాజెక్టును అడ్డుకునేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్
- కేఆర్ఎంబీకి తెలంగాణ నీటిపారుదల శాఖ ఫిర్యాదు
- 1.865 టీఎంసీల నీటి తరలింపుపై అభ్యంతరాలు



ప్రజా వాయిస్, హైదరాబాద్: నాగార్జున సాగర్ జలాశయం నుంచి నీటిని తరలించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్నట్లు ప్రచారంలో ఉన్న భారీ టన్నెల్ ప్రాజెక్టు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వాన్ని టీఆర్ఎస్ అధినేత్రి కవిత నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతితోనే ఏపీ ప్రభుత్వం పనులు చేపడుతోందా? ఇంత పెద్ద ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సమాచారం లేదా? అంటూ ప్రశ్నించారు. సమాచారం లేకపోతే రాష్ట్ర నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నట్లు అని నిలదీశారు.నాగార్జున సాగర్ నుంచి నీటిని తరలించే ప్రాజెక్టుపై ప్రభుత్వానికి సమాచారం లేదంటే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఒక్క క్షణం కూడా పదవిలో కొనసాగడానికి అర్హుడు కాదని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు

మిగతా 2లో

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉందా? అన్న చర్చ కూడా తెరపైకి వచ్చింది.

బీజేపీ ఇంప్లీడ్ పిటిషన్‌తో ట్విస్ట్

ఇదే సమయంలో బీజేపీ తరఫున గత ఎన్నికల్లో పోటీ చేసిన చింతల రామచంద్రారెడ్డి కూడా న్యాయపోరాటంలోకి దిగారు. విజయారెడ్డి పిటిషన్‌పై స్పందిస్తూ తెలంగాణ హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. 2023 ఎన్నికలు కేవలం ఇద్దరు అభ్యర్థుల మధ్య జరిగిన పోటీ కాదని, బహుముఖ పోటీ అని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తూ.. బహుముఖ పోటీలో విజేత ఎన్నిక రద్దయితే రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థిని నేరుగా విజేతగా ప్రకటించడం చట్టబద్ధం కాదని వాదించారు.

ఉప ఎన్నికే నిర్వహించాలంటున్న బీజేపీ

రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థికి నేరుగా ఎమ్మెల్యే పదవి కట్టబెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని చింతల రామచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజల అభిప్రాయాన్ని మరోసారి తెలుసుకోవాలంటే ఉప ఎన్నిక నిర్వహించడమే సరైన మార్గమని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో విజయారెడ్డి పిటిషన్‌తో పాటు బీజేపీ నేత దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్ కూడా కీలకంగా మారింది.

కోర్టు తీర్పు తర్వాతే ఉప ఎన్నికపై స్పష్టత!

ఒకవైపు దానం నాగేందర్ అనర్హత వ్యవహారం, మరోవైపు విజయారెడ్డి ఎన్నికల పిటిషన్, ఇంకోవైపు బీజేపీ అభ్యంతరాలతో ఖైరతాబాద్ ఉప ఎన్నిక వ్యవహారం న్యాయస్థానం పరిధిలోకి వెళ్లింది. హైకోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగానే తదుపరి పరిణామాలు ఉండనున్నాయి. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి అవకాశం దక్కుతుందా? లేక మళ్లీ ప్రజాతీర్పు కోసం ఉప ఎన్నిక నిర్వహిస్తారా? అన్నది తేలాల్సి ఉంది. ప్రస్తుతానికి ఉప ఎన్నిక తేదీపై స్పష్టత లేదు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఖైరతాబాద్ రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగనుంది.

సీఎం రేవంత్‌కు రాజగోపాల్‌రెడ్డి అల్టిమేటం..
నిధులివ్వకుంటే కురుక్షేత్రమే!

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత అసమ్మతి స్వరం వినిపించింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గానికి నిధులు కేటాయించకపోతే కురుక్షేత్రం తప్పదంటూ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ప్రభుత్వం ఉన్నది పేదల సంక్షేమం కోసమే కానీ కాంట్రాక్టర్ల కోసం కాదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రికి అదృష్టం కలిసి వచ్చిందని, మిగిలిన రెండేళ్ల పాలనలో అందరినీ సమానంగా చూస్తూ తండ్రి పాత్ర పోషించాలని హితవు పలికారు.

రేవంత్ పాలనపై తీవ్ర అసంతృప్తి

రేవంత్‌రెడ్డి పాలనలో ఎవరూ సంతోషంగా లేరని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ అంటే కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ మాత్రమేనా? అని ప్రశ్నించారు. ఆంధ్రా నాయకుల కనుసన్నల్లోనే పాలన సాగుతోందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మునుగోడు అభివృద్ధికి నిధులు ఇవ్వకపోతే మరో చరిత్ర సృష్టిస్తానని హెచ్చరించారు. ఉన్న హైదరాబాద్‌కే దిక్కు లేదని, అలాంటప్పుడు ఫ్యూచర్ సిటీ ఎందుకని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పాలన ఎలా సాగిస్తారని నిలదీశారు.

పెన్షన్లు రూ.5 వేలకు పెంచాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించాలని, వాటిని వెంటనే రూ.5



వేల వరకు పెంచాలని రాజగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెన్షన్లు పొందుతున్న వారిలో కొంతమంది అనర్హులు కూడా ఉన్నారని, అలాంటి వారిని గుర్తించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. రైతుబంధు పథకాన్ని కూడా నిజంగా వ్యవసాయం చేసే రైతులకే అందించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగాలు చేసుకునే వారికి రైతుబంధు అందుతుండగా, కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

కాంట్రాక్టర్ల కోసం అప్పులు చేశారా?

గత ప్రభుత్వం కాంట్రాక్టర్ల కోసం లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి అవినీతికి పాల్పడిందని ఆరోపించిన రాజగోపాల్‌రెడ్డి.. ఆ నిధులను పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రతిపక్షంలోనే ఉండాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై అధికార పార్టీ ఎమ్మెల్యేగా కూడా ప్రశ్నించే హక్కు తనకు ఉందని సంకేతాలిచ్చారు.

పదవుల కోసం ఎవరి చుట్టూ తిరగను

తనకు పదవులపై ఆశ లేదని, పదవుల కోసం ఎవరి ఇంటి చుట్టూ తిరిగే వ్యక్తిని కాదని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు రావాల్సిన పదవి ఉంటే అదే వస్తుందని వ్యాఖ్యానించారు. గతంలో వైఎస్సార్ మాట తప్పం.. మడమ తిప్పం అంటూ పాలనలో తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. తమ నియోజకవర్గానికి నిధులు ఇవ్వాలని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలనేది తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్‌లోనే ఉంటూ ముఖ్యమంత్రిపై బహిరంగంగా విమర్శలు చేయడం, నిధుల కోసం హెచ్చరికలు జారీ చేయడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎన్విడియాకు ర్యాన్సమ్‌వేర్ ముప్పు..
10 రోజుల డెడ్‌లైన్ విధించిన హ్యాకర్లు!

- **కీలక సమాచారం తమ వద్ద ఉందంటూ 'ది జెంటిల్మెన్' గ్రూప్ ప్రకటన**
- **10 రోజుల్లో స్పందించకుంటే డార్క్‌వెబ్‌లో డేటా లీక్ చేస్తామని హెచ్చరిక**
- **డార్క్‌వెబ్‌లో కౌంట్‌డౌన్ టైమర్ ఏర్పాటు**
- **డేటా చోరీకి సంబంధించిన ఆధారాలు మాత్రం వెల్లడించని హ్యాకర్లు**
- **గతంలోనూ పలు సంస్థలకు ఇలాంటి బెదిరింపులు**



ప్రజా వాయిస్, టెక్నాలజీ డెస్క్:ప్రముఖ కంప్యూటర్ చిప్‌ల తయారీ సంస్థ ఎన్విడియాకు సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందన్న వార్తలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. సంస్థకు చెందిన కీలక సమాచారాన్ని తాము చేజిక్కించుకున్నామని 'ది జెంటిల్మెన్' అనే సైబర్ నేరగాళ్ల గ్రూప్ ప్రకటించింది. మరో 10 రోజుల్లోగా స్పందించకపోతే ఆ సమాచారాన్ని డార్క్‌వెబ్‌లో బహిర్గతం చేస్తామని హెచ్చరించింది. ఈ డెడ్‌లైన్‌ను గుర్తుచేస్తూ డార్క్‌వెబ్‌సైట్‌లో కౌంట్‌డౌన్ టైమర్‌ను సైతం ఏర్పాటు చేసింది.

ఏ సమాచారం చోరీ చేశారు?

ఎన్విడియాకు చెందిన ఎలాంటి సమాచారం తమ చేతుల్లో ఉందనే విషయాన్ని హ్యాకర్లు వెల్లడించలేదు. తమ ఆరోపణలకు మద్దతుగా ఎలాంటి శాంపిల్ డేటాను కూడా బయటపెట్టలేదు. అసలు ఏ మార్గంలో సంస్థ సమాచారాన్ని సేకరించారనే వివరాలపైనా స్పష్టత ఇవ్వలేదు. అయితే తమతో సంప్రదింపులు జరిపేందుకు ఎన్‌క్రిప్టెడ్ టాక్ ఐడీని మాత్రం డార్క్‌వెబ్‌లో అందుబాటులో ఉంచారు. మరోవైపు డేటా చోరీ జరిగిందా? లేదా? అనే అంశంపై ఎన్విడియా సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు.

గతంలోనూ ఇదే తరహా బెదిరింపులు

సైబర్‌న్యూస్ సంస్థ తొలుత ఈ వ్యవహారంపై కథనాన్ని ప్రచురించింది. 'ది జెంటిల్మెన్' గ్రూప్ గతంలోనూ పలు సంస్థలకు ఇలాంటి బెదిరింపులు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే కొన్ని సందర్భాల్లో పాత డేటాను ఆధారంగా చేసుకుని హెచ్చరికలు చేసినట్లు బయటపడటంతో ఆ గ్రూప్ విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తాయి.

2025లో తెరపైకి వచ్చిన సైబర్ గ్రూప్

2025 జులైలో తొలిసారిగా 'ది జెంటిల్మెన్' గ్రూప్ పేరు వెలుగులోకి వచ్చింది. సైబర్ నేరగాళ్లకు హ్యాకింగ్‌కు అవసరమైన సాధనాలను అందిస్తూ, వాటి ద్వారా నేరగాళ్లు వసూలు చేసే డబ్బులో కొంత వాటాను పొందే విధంగా ఈ గ్రూప్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఎన్విడియా డేటా చోరీ ఆరోపణల్లో వాస్తవమెంత? హ్యాకర్ల వద్ద నిజంగానే సంస్థకు చెందిన కీలక సమాచారం ఉందా? అన్నది తేలాల్సి ఉంది. సంస్థ అధికారిక స్పందన, తదుపరి పరిణామాలపై ఇప్పుడు టెక్నాలజీ రంగం దృష్టి నెలకొంది.

నాగార్జున సాగర్‌పై ఏపీ టన్నెల్..
తెలంగాణ సర్కారుపై కవిత ఫైర్!

మొదటి పేజీ తరువాయి

విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని, అనుమతులు లేకుండా చేపడుతున్న పనులను నిలిపివేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

రూ.1,200 కోట్లతో టన్నెల్ ప్రాజెక్టు?

విజయపురి సౌత్ ప్రాంతంలో నాగార్జున సాగర్ డ్యామ్ కుడివైపు అమరజీవి జలప్రపథకం పేరుతో ఏపీ ప్రభుత్వం భారీ సొరంగం నిర్మిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా జలాశయంలో నీటిమట్టం 510 అడుగులకు పడిపోయినా గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశం ఉంటుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాగునీటి అవసరాల పేరుతో చేపడుతున్న ఈ పథకం ద్వారా భవిష్యత్తులో సాగునీటి అవసరాలకూ నీటిని మళ్లించే ప్రమాదం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రాజెక్టు తొలి దశకు సుమారు రూ.1,200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు సమాచారం. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. రోజుకు 160 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నీటి శుద్ధి ప్లాంట్, ఇన్‌టేక్ వెల్, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నీటిని తరలించే వ్యవస్థ ఇందులో భాగంగా ఉన్నట్లు సమాచారం.

కేఆర్ఎంబీకి తెలంగాణ అధికారుల ఫిర్యాదు



మరోవైపు ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉందన్న విమర్శల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు ఈ ప్రాజెక్టుపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ, వాటిని తక్షణమే నిలిపివేయాలని కోరినట్లు సమాచారం. ఈ పథకం ద్వారా సుమారు 1.865 టీఎంసీల నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారని తెలంగాణ అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది.ఒకవైపు కవిత ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేస్తుండగా, మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులు కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసినట్లు వస్తున్న సమాచారం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. ఏపీ టన్నెల్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

షీటీమ్స్ పేరుతో మాజీ ప్రియుడికి ఫేక్ నోటీసు

ప్రజా వాయిస్, హైదరాబాద్: మహిళల భద్రత కోసం నిరంతరం పనిచేసే షీటీమ్స్ పేరును ఓ యువతి తన వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు ఉపయోగించుకోవడం హైదరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది. మాజీ ప్రియుడిపై పగ పెంచుకున్న ఓ యువతి ఏకంగా షీటీమ్స్ పోలీసుల పేరుతో నకిలీ నోటీసు సృష్టించి అతడికి పంపించింది. తన స్నేహితుడి సహకారంతో ఈ వ్యవహారానికి పాల్పడినట్లు తెలుస్తోంది.గుర్తుతెలియని ఫోన్ నంబర్ నుంచి తన మాజీ ప్రియుడికి షీటీమ్స్ పోలీసులు నోటీసు పంపించినట్లుగా యువతి నకిలీ పత్రాన్ని పంపించింది. అయితే ఆ నోటీసుపై అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే షీటీమ్స్ పోలీసులను సంప్రదించాడు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తమ అధికారిక పేరును ఉపయోగించి నకిలీ నోటీసు తయారు చేయడాన్ని గుర్తించిన షీటీమ్స్ పోలీసులు సైతం ఆశ్చర్యానికి గురయ్యారు.పోలీసుల పేరును, అధికారిక వ్యవస్థలను వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన షీటీమ్స్ అధికారులు వెంటనే సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నకిలీ నోటీసును ఎలా తయారు చేశారు? దాని రూపకల్పనలో స్నేహితుడి పాత్ర ఎంత? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు. పోలీసుల పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిమ్స్ అక్రమాలపై ఏసీబీ విచారణ

మొదటి పేజీ తరువాయి

నాయకులు, ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, ఇతర ప్రముఖుల నుంచి బెడ్ల కోసం ఫోన్లు వచ్చేవని, అయితే రోగి పరిస్థితి, అత్యవసరత, ఆరోగ్య తీవ్రతను బట్టి బెడ్ కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నట్లు వివరించినట్లు సమాచారం.

టెండర్లపై ఏసీబీ ఆరా..

క్యాంటీన్ టెండర్ కమిటీలో సభ్యురాలిగా నియామకంపై ప్రశ్నించగా.. తనకు స్పష్టంగా గుర్తులేదని భాస్కర్ చెప్పినట్లు తెలుస్తోంది. క్యాంటీన్ టెండర్లలో ప్రిజం, నక్షత్ర సంస్థలు పాల్గొన్నాయని, ప్రస్తుతం నక్షత్ర సంస్థ నిమ్స్‌లో క్యాంటీన్ నిర్వహిస్తోందని వెల్లడించినట్లు సమాచారం. 2026 టెండర్ల షెడ్యూల్ తయారీలో తన పాత్రపై ప్రశ్నించగా.. దానిపై అవగాహన లేదని చెప్పినట్లు తెలుస్తోంది. మెడికల్ షాపుల టెండర్ల కమిటీలో సభ్యురాలిగా ఉన్నానని, మ్యాన్‌పవర్ టెండర్ల గురించి తనకు తెలియదని వివరించినట్లు సమాచారం.

ప్లాట్ కోసం రూ.30 లక్షల బదిలీ

ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. 2009లో సోమాజిగూడలో ప్లాట్ కొనుగోలు కోసం ఆర్టీజీఎస్ ద్వారా నవీన్ అనే వ్యక్తికి రూ.30 లక్షలు బదిలీ చేసినట్లు భాస్కర్ వెల్లడించినట్లు తెలుస్తోంది. డబ్బులు తీసుకుని నవీన్ మోసం చేయడంతో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపినట్లు సమాచారం. అయితే ఆస్తుల కొనుగోలు సమయంలో ఆరోగ్య శాఖకు సమాచారం ఇవ్వలేదని అంగీకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు గణేష్, అరుణ పేర్లతో ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగిన అంశంపై మాత్రం లక్ష్మీ భాస్కర్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని సమాచారం. ఈ వాంగ్మూలం, ఆస్తుల వివరాలు, టెండర్లకు సంబంధించిన రికార్డుల ఆధారంగా ఏసీబీ తదుపరి విచారణ కొనసాగించనున్నట్లు తెలుస్తోంది.

మల్లమ్మకు డెత్ సర్టిఫికెట్..
నెల రోజులైనా
కాకతీయ హాస్పిటల్‌పై చర్యలేవీ?

ప్రజా వాయిస్, మేడ్చల్ జిల్లా: బతికున్న మల్లమ్మకు చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాకతీయ హాస్పిటల్ వ్యవహారంలో అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఘటనపై గత నెల 22న ప్రజా వాయిస్ తరఫున మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదుపై విచారణ జరిగినట్లు తెలిసినా, బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నకు సమాధానం కరువైంది.



విచారణ జరిగిందా? చర్యలు ఎందుకు లేవు?

కాకతీయ హాస్పిటల్‌లో బతికున్న మల్లమ్మకు మరణ ధ్రువీకరణ పత్రం ఎలా జారీ చేశారు? అందుకు బాధ్యులెవరు? ఆస్పత్రి యాజమాన్యం పాత్ర ఏమిటి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజా వాయిస్ డీఎంహెచ్ఓను కోరింది. అయితే ఫిర్యాదు చేసి నెల రోజులు దాటుతున్నా బాధ్యులపై చర్యలు తీసుకున్నట్లు ఎలాంటి సమాచారం లేదు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే ఫిర్యాదుదారులకు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని ప్రజా వాయిస్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

అధికారులే బాధ్యత నుంచి తప్పించుకుంటే ఎలా?

ప్రజల ఆరోగ్య భద్రతను కాపాడాల్సిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రైవేట్ ఆస్పత్రుల వ్యవహారాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్యులకు న్యాయం ఎలా జరుగుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక వ్యక్తి బతికుండగానే మరణించినట్లు ధ్రువీకరణ పత్రం జారీ అయ్యిందన్న ఆరోపణ చిన్న విషయం కాదు. ఇలాంటి ఘటనలపై తక్షణమే స్పందించి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం, చర్యలపై స్పష్టత ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కలెక్టర్, ఆరోగ్య మంత్రి జోక్యం చేసుకోవాలి

ఈ వ్యవహారంపై మేడ్చల్ జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణమే స్పందించాలని ప్రజా వాయిస్ డిమాండ్ చేస్తోంది. కాకతీయ హాస్పిటల్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతోంది. అలాగే ఫిర్యాదుపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తోంది. ప్రజల ప్రాణాలతో, అధికారిక ధ్రువీకరణ పత్రాలతో ముడిపడిన ఇలాంటి తీవ్రమైన ఆరోపణలపై అధికారులు మౌనం వీడి సమాధానం చెప్పాలి. బాధితురాలికి న్యాయం జరిగే వరకు ప్రజా వాయిస్ ఈ అంశాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్తుంది.

రూ.1.50 లక్షల లంచం తీసుకుంటూ
ఏసీబీకి చిక్కిన పబ్లిక్ ప్రాసిక్యూటర్!

ప్రజా వాయిస్, పెద్దపల్లి:న్యాయం చెప్పాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉండి లంచం తీసుకుంటూ ఓ ప్రభుత్వ న్యాయవాది ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పెద్దపల్లి జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న డొంకెన రవీందర్ రూ.1.50 లక్షల లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో ఆయనకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ వ్యక్తి రెడ్డిరాజుల రాజయ్యను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



హత్య కేసులో అనుకూలంగా వ్యవహరిస్తానంటూ డిమాండ్

2023లో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లిలో భూ వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం హత్యకు దారితీయడంతో మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు పెద్దపల్లి జిల్లా కోర్టులో విచారణలో ఉంది. ఈ క్రమంలో కేసులో నిందితులకు అనుకూలంగా వ్యవహరించడంతో పాటు సాక్షుల విచారణను సులభతరం చేస్తానంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. తొలుత రూ.2 లక్షలు అడిగి, చివరకు రూ.1.50 లక్షలు తీసుకునేందుకు అంగీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పక్కా ప్రణాళికతో ఏసీబీ దాడులు

రవీందర్ లంచం డిమాండ్ చేయడంతో బాధితులు కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదుపై స్పందించిన అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం పెద్దపల్లిలోని రవీందర్ నివాసంలో బాధితుడి నుంచి రూ.1.50 లక్షలు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. రవీందర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

ప్రైవేట్ వ్యక్తి కూడా అరెస్ట్

కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం. లంచం వ్యవహారంలో రవీందర్‌కు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెడ్డిరాజుల రాజయ్యను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అనంతరం వారిని కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు.

న్యాయ వ్యవస్థలో అవినీతి ఆరోపణలపై చర్చ

ప్రభుత్వం తరఫున న్యాయస్థానాల్లో వాదనలు వినిపించే పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర న్యాయ ప్రక్రియలో అత్యంత కీలకం. అలాంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిపై లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. న్యాయస్థానాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత కలిగిన అధికారులపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కేసులో పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

లైంగిక వేధింపు ఘటనలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి సస్పెండ్

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు
- కేసును చేదించి నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- నిందితుడి వెంకన్న తో పాటు ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి, మెస్ అటెండర్ పూలమ్మ ఆమె భర్త సోమయ్య కాంట్రాక్టర్ మధు అరెస్ట్
- కోర్టులో హాజరు పరిచిన పోలీసులు
- కేసును ఛేదించిన పోలీసులను అభినందించిన జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు



ప్రజా వాయిస్/అడ్డగూడూరు : యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు బాలికల గురుకుల పాఠశాలలో కలకలం రేపిన విద్యార్థినుల లైంగిక వేధింపు ఘటనలో ప్రిన్సిపాల్ ఝాన్సీరాణిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనలో నిందితుడిగా ఉన్న వంట మనిషి వెంకన్నను పోలీసులు హైదరాబాదులోని ముసుగూరులో నిందుతుండి అరెస్టు చేశారు. విద్యార్థినుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఫోక్సో కేసు నమోదు చేయడంతోపాటు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ రాణి, మెస్ అటెండర్ పూలమ్మ, ఆమె భర్త సోమయ్య, మెస్ కాంట్రాక్టర్ మధును పోలీసులు అరెస్టు చేసి రామన్నపేట కోర్టులో హాజరు పరిచినట్లు స్థానిక ఎస్సై వెంకట్ రెడ్డి విలేకరులకు తెలిపారు. మొత్తం ఐదుగురు విద్యార్థినులు బాధితులుగా ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ మధుసూదన్ రెడ్డి పాఠశాలలు సందర్శించారు. కేసు దర్యాప్తును అతివేగంగా పూర్తి చేసిన పోలీసులను అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ పోలీసులను అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు.

బర్రెల కొట్టంగా మారిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- మంథని కూచిరాజుపల్లెలో నిరుపయోగంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు..
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయా?
- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు.. - పట్టించుకోని అధికారులు
- పర్యవేక్షణ కరువైందంటున్న స్థానికులు
- ప్రజాధనం వెచ్చించినా నిరుపేదలకు అందని ఇళ్ల ప్రయోజనం





ప్రజా వాయిస్ మంథని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజుపల్లెలో నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నేటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్న పరిస్థితి కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే బహుళ అంతస్తులతో నిర్మించిన భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోయినట్లు కనిపిస్తోంది. భవనానికి కిటికీలు, గోడలు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ పనులు పూర్తికాలేదు. కిందిభాగంలో ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ఖాళీగా ఉండటంతో పాటు, లోపల ఎండుగడ్డి, చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి నిర్వహణ లేకపోవడానికి అద్దం పడుతున్నాయి. భవనం లోపలి పరిస్థితులు చూస్తుంటే కనీస పర్యవేక్షణ కూడా లేనట్లు స్పష్టమవుతోంది. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాలను కొంతమంది వ్యక్తులు తమకు అనుకూలంగా వినియోగించుకుంటున్నారని, అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారం స్థానికుల నుంచి వినిపిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భవనాలు ఇలా పర్యవేక్షణ లేకుండా ఉండటం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇళ్లు అర్హులైన పేదలకు ఎందుకు అందుబాటులోకి రావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణాలు ఎందుకు నిలిచిపోయాయి? మిగిలిన పనులు పూర్తి చేయడానికి నిధుల కొరత ఉందా? లేక సంబంధిత శాఖల నిర్లక్ష్యమే కారణమా? ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఉంది.

కలెక్టర్ గారు.. స్పందించండి

కూచిరాజుపల్లెలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై సంబంధిత మున్సిపల్, గృహ నిర్మాణ శాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలి. భవనాల భద్రతను పరిశీలించి, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై కూడా విచారణ జరపాలి. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పేదల సొంతింటి కల కోసం నిర్మించిన భవనాలు.. చివరకు నిరుపయోగంగా మిగిలిపోవడమేనా? ప్రజాధనానికి బాధ్యత వహించేది ఎవరు? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

కూలితేనే కదులుతారా.?

- ప్రజల ప్రాణాలంటే అంత చులకనా.?
- మందమర్రిలో శిథిలావస్థకు చేరిన పాత వాటర్ ట్యాంక్
- మున్సిపాలిటీ, సింగరేణి మధ్య బాధ్యతల కొట్లాట
- ప్రమాదం పొంచి ఉన్నా పట్టని వైనం!



ప్రజా వాయిస్,మందమర్రి: ఒకవైపు కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత వాటర్ ట్యాంక్.. మరోవైపు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు మందమర్రి పట్టణంలోని వెంకటేశ్వర గుడి సమీపంలో శిథిలావస్థకు చేరిన పాత వాటర్ ట్యాంక్ స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఏ క్షణంలో కూలుతుందోనన్న భయంతో సమీప కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు.

బాధ్యత ఎవరిది.? బలయ్యేది ప్రజలా.?

ట్యాంక్ సింగరేణి పరిధిలోనిదని మున్సిపాలిటీ అధికారులు.. మున్సిపాలిటీ పరిధిలోనిదని సింగరేణి అధికారులు చెబుతూ బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల భద్రతను గాలికొదిలేసి పరిధుల పంచాయితీతో కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణనష్టం జరిగితేనే మేల్కొంటారా.?

పాత ట్యాంక్ కూలి ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు. అమాయకుల ప్రాణాలు పోయాక విచారణలు, హామీలతో ప్రయోజనమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంక్‌ను పరిశీలించి, ప్రమాదకరంగా ఉంటే వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏసీబీ వలలో పబ్లిక్ ప్రాసిక్యూటర్

- హత్య కేసులో నిందితులకు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.2 లక్షలు డిమాండ్ ?
- రూ.1.50 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న కరీంనగర్ ఏసీబీ అధికారులు



ప్రజా వాయిస్ పెద్దపల్లి న్యాయం చేయాల్సిన బాధ్యత కలిగిన న్యాయవ్యవస్థలోని ఓ కీలక అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన ఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. హత్య కేసులో నిందితులకు అనుకూలంగా వ్యవహరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్‌ను కరీంనగర్ ఏసీబీ అధికారులు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.2 లక్షలు డిమాండ్ చేయగా, ఒప్పందంలో భాగంగా రూ.1.50 లక్షలు తీసుకుంటున్న సమయంలో అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు సమాచారం. 2023లో ధర్మారం మండలం రచ్చపల్లిలో జరిగిన భూ వివాదం హత్యకు దారితీసింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో విచారణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో విచారణలో నిందితులకు అనుకూలంగా వ్యవహరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. లంచం వ్యవహారంపై సమాచారం అందుకున్న కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం పక్కా ప్రణాళికతో వల పన్నింది. ఒప్పందంలో భాగంగా బాధితుల నుంచి బుధవారం రూ.1.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి రవీందర్‌ను పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రజలకు న్యాయం అందించాల్సిన వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వహించే అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే బాధితులకు వ్యవస్థపై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఉన్నవారే అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై ఏసీబీ విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.a



నాటుసారా స్థావరాల పై కొయ్యూరు పోలీసుల దాడులు

- ఆరుగురిపై కేసులు.. 41 లీటర్ల నాటుసారా స్వాధీనం
- 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- రూ.3 లక్షల చొప్పున బైండోవర్



జా వాయిస్ మలహరావు జయశంకర్ భూపాలపల్లి జిల్లా సలహాల రావు మండలంలోని తాడిచెర్ల, కాపురం గ్రామాల శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా తయారీ కేంద్రాలపై కొయ్యూరు పోలీసులు దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం ఎస్సై మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలోని వాగు పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీలో నిమగ్నమైన తాడిచెర్లకు చెందిన అనుముల హరీష్, చిగురు క్రాంతికుమార్, బోనగిరి రాజయ్య, జోడు రవి, డొల్క చిన్న మల్లయ్య, బోనగిరి ఓదెలు అనే ఆరుగురిని గుర్తించి కేసులు నమోదు చేశారు.దాడుల్లో సిద్ధంగా ఉంచిన 41 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోగా, తయారీ కోసం నిల్వ చేసిన సుమారు 700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. పట్టుబడిన ఆరుగురిని మండల తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి ఒక్కొక్కరిని రూ.3 లక్షల చొప్పున బైండోవర్ చేశారు.మరోసారి నాటుసారా తయారీకి పాల్పడితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ఎస్సై హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్లు తెరుస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాబితాలో పేరుంది.. పింఛన్ పత్రమేది.?

- చేయూత పింఛన్ మంజూరులో చేనేత కార్మికురాలికి అన్యాయం
- సమావేశానికి రావాలంటూ అధికారుల సమాచారం
- తీరా వెళ్తే జాబితాలో పేరు.. చేతికి అందని పత్రం
- పెండింగ్ లో ఉందంటూ అధికారుల సమాధానం
- నిలదీసిన బాధితురాలు విడెం అమృత లక్ష్మి

ప్రజావాయిస్ / సంస్థాన్ నారాయణపురం: జాబితాలో పేరు చూసి సంబరపడిన ఆ చేనేత కార్మికురాలికి చివరకు నిరాశే మిగిలింది. చేయూత పింఛన్ మంజూరు పత్రం అందజేస్తామంటూ సమావేశానికి పిలిచిన అధికారులు.. తీరా అక్కడికి వెళ్లాక దరఖాస్తు పెండింగ్‌లో ఉందంటూ చేతులెత్తేశారు. దీంతో తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు అధికారులను నిలదీశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది.మండల కేంద్రానికి చెందిన విడెం అమృత లక్ష్మి (54) దశాబ్దాలుగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇటీవల విడుదలైన లబ్ధిదారుల జాబితాలో ఆమె పేరు కనిపించింది. దీంతో పింఛన్ మంజూరు పత్రం అందుతుందన్న ఆశతో అధికారులు సూచించిన సమావేశానికి హాజరయ్యారు. అయితే పంపిణీ సమయంలో తన పేరుతో పత్రం లేకపోవడంతో అవాక్కయ్యారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా.. దరఖాస్తు పెండింగ్‌లో ఉందని సమాధానమిచ్చారు. పెండింగ్‌లో ఉంటే జాబితాలో పేరు ఎందుకు చేర్చారని, పత్రం ఇస్తామని పిలిచి ఎందుకు నిరాశకు గురిచేశారని ఆమె ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి అర్హతను పరిశీలించి తనకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని అమృత లక్ష్మి కోరుతున్నారు.

బూడిద మాటున రూ.6.20 కోట్ల బాగోతం.!

- లారీకి రూ.500 చొప్పున వసూళ్లు?
- జీవో ఏది.? రసీదు ఏది.? లెక్క లెక్కడ.?
- జిల్లా కలెక్టర్ కు కోరుకంటి చందర్ సూటి ప్రశ్నలు
- లారీలతో కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరిక



ప్రజావాయిస్, పెద్దపల్లి:ఎన్టీపీసీ బూడిద ఉచితంగా లభిస్తున్నా.. దాన్ని తరలించే లారీ యజమానుల జేబులకు మాత్రం చిల్లు పడుతోంది.ఒక్కో లారీ నుంచి రూ.500 చొప్పున వసూలు చేస్తూ మూడేళ్లలో రూ.6.20 కోట్ల మేర వసూలు చేశారంటూ ఆరోపణలు ఈ వసూళ్లకు ప్రభుత్వ అనుమతి ఉందా, జీవో ఉందా, రసీదులు ఎందుకు ఇవ్వడం లేదు, ఇప్పుడు ఇవే ప్రశ్నలు పెద్దపల్లి జిల్లా యంత్రాంగాన్ని చుట్టుముడుతున్నాయి. బూడిద రవాణా పేరుతో జరుగుతున్న వసూళ్లపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తీవ్ర ఆరోపణలు చేశారు.బుధవారం పెద్దపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లలో ఎన్టీపీసీ నుంచి బూడిద తరలింపునకు 1.24 లక్షల ట్రిప్పులు జరిగినట్లు చెబుతున్నారని, ఒక్కో ట్రిప్పునకు రూ.500 చొప్పున లెక్కిస్తే రూ.6.20 కోట్ల మేర వసూళ్లు జరిగినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇంత భారీ మొత్తంలో వసూలు చేసిన సొమ్ముకు కనీసం రసీదు కూడా ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల నుంచి పన్నులు, రుసుములు వసూలు చేయాలంటే చట్టబద్ధమైన అధికారం ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 265 చెబుతోందని గుర్తుచేశారు. మరి ఈ వసూళ్లకు ఏ జీవో ఆధారం ఏ శాఖ అనుమతి ఇచ్చింది. సొమ్ము ప్రభుత్వ ఖజానాకు చేరిందా అని కలెక్టర్‌ను నిలదీశారు.

రూ.50కి బదులు రూ.3,500 వసూళ్లు.?

మట్టి రవాణా వ్యవహారంలోనూ లారీ యజమానులపై మోయలేని భారం మోపుతున్నారని చందర్ ఆరోపించారు. క్యూబిక్ మీటరుకు రూ.40 నుంచి రూ.50 వరకు ఉండాల్సిన వసూళ్లు రూ.3,500 వరకు చేరుతున్నాయని విమర్శించారు. పోలీసుల జరిమానాలు, వాహనాల సీజ్‌లతో లారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీజిల్ ఖర్చులు, డ్రైవర్ల జీతాలు, బ్యాంకు ఈఎంఐలు చెల్లించలేక అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లెక్కలు చెప్పకుంటే లారీలతోనే కలెక్టరేట్ దిగ్బంధం

లారీ సంబర్ల వారీగా వసూలైన సొమ్ము వివరాలను బయటపెట్టాలని, అక్రమ వసూళ్లు జరిగినట్లు తేలితే యజమానులకు తిరిగి చెల్లించాలని చందర్ డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే డీటీఓ, సీబీఐ, కేంద్ర విజిలెన్స్ కమిషన్, ఈడీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ సమాధానం రాకపోతే లారీ యజమానులను సమీకరించి లారీలతోనే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రీరామ్ లారీ యాష్ టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె అశోక్, ముత్యం అనిల్ గౌడ్, రాము గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్ కుమార్, నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో దారుణం...!

- మానవత్వానికే మచ్చ!
- మార్చురీ పక్కనే మృతదేహాల దహనం..
- ఆసుపత్రి సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం!





ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మానవత్వానికే మచ్చ తెచ్చేలా ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలో మృతి చెందిన వారి మృతదేహాలను గౌరవప్రదంగా అంత్యక్రియలకు తరలించాల్సింది పోయి, మార్చురీ పక్కనే దహనం చేసినట్లు వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది.ప్రజలకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాల పట్ల ఇంతటి నిర్లక్ష్యమా? చనిపోయిన వారికి కూడా గౌరవం లేకుండా వ్యవహరించడం ఏంటి? ఆసుపత్రి సిబ్బందికి బాధ్యత లేదా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

ఆసుపత్రి ప్రాంగణంలోనే ఇలాంటి ఘటన జరగడం అధికారుల పర్యవేక్షణ వైఫల్యానికి నిదర్శనమా?

ఈ వ్యవహారంపై ఆసుపత్రి ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? అసలు మృతదేహాలను దహనం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? దీనికి బాధ్యులెవరు?

జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి

ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి. బాధ్యులుగా తేలిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి.వైద్యం కోసం వచ్చే పేదలకు న్యాయం చేయలేకపోయినా, కనీసం చనిపోయిన వారి మృతదేహాలకైనా గౌరవం ఇవ్వాలి. ఈ ఘటనపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం మరింత సన్నగిల్లే ప్రమాదం ఉంది.

విద్యార్థుల చదువులపై నిర్లక్ష్యం...- విలాసాలకు ప్రాధాన్యమా?

- కూచిరాజ్ పల్లి పాఠశాల కూల్చివేతపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆగ్రహం
- 80 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఇదేనా విద్యా సౌకర్యం?
- పాఠశాల భవనం ఎక్కడ నిర్మిస్తారో కూడా తెలియని పరిస్థితి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



ప్రజా వాయిస్ మంథని పట్టణ పరిధిలోని కూచిరాజ్‌పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సందర్శించారు. పాఠశాల పరిస్థితిని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై, స్థానిక ఎమ్మెల్యే కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారు. 80 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల పిల్లల విద్యా పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని, కూచిరాజ్‌పల్లి పాఠశాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోందని అన్నారు. ఒక కుటుంబానికి 40 ఏళ్ల పాటు పాలించే అవకాశం లభిస్తే గ్రామీణ, బడుగు వర్గాల అభివృద్ధికి ఏమి చేశారో ఈ పాఠశాల పరిస్థితి ప్రశ్నిస్తోందని వ్యాఖ్యానించారు.

మంచిగా ఉన్న పాఠశాలను ఎందుకు కూల్చారు?

పాఠశాల భవనం మంచిగానే ఉన్నప్పటికీ కూల్చివేశారని పుట్ట మధుకర్ ఆరోపించారు. భవనం శిథిలావస్థలో ఉందని ప్రధానోపాధ్యాయుడు చెబుతున్నారని పేర్కొంటూ, పాఠశాల పునర్నిర్మాణానికి ముందస్తు ప్రణాళిక లేకుండానే భవనాన్ని తొలగించడంపై ప్రశ్నలు లేవనెత్తారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు, ఆరు నెలలు గడుస్తున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కొత్త భవన నిర్మాణంపై స్పష్టత లేదని విమర్శించారు.

పిల్లల చదువుల కంటే గెస్ట్ హౌస్ లే ముఖ్యమా?

ఎమ్మెల్యేకు ధన్వాడ, మంథని, పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల్లో గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయని ప్రస్తావించిన పుట్ట మధుకర్, ప్రజాప్రతినిధుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు కనీస వసతులు కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పిల్లలు చదువుకునే పాఠశాలలకు అవసరమైన సదుపాయాలు కల్పించకుండా విలాసవంతమైన వసతుల గురించి ఆలోచించడం సరైంది కాదని విమర్శించారు. ఈ పాఠశాలలో ప్రధానంగా ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులే చదువుకుంటున్నారని, ఇదే పాఠశాలలో అధికార కుటుంబానికి చెందిన పిల్లలు లేదా వారి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు చదువుకుంటే పరిస్థితి ఇలాగే ఉండేదా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, కళాశాలలే పేద విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులని, అలాంటి విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటి వరకు కొత్త పాఠశాల ఎక్కడ నిర్మిస్తారు? స్థలం ఎక్కడ కేటాయించారు? నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? అనే విషయాలపై స్పష్టత లేదని పుట్ట మధుకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం చెప్పినట్లే అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవాలని సూచించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ పాలనలో బడుగు వర్గాల పిల్లలకు అందుతున్న విద్యా సౌకర్యాలు ఏమిటో కూచిరాజ్‌పల్లి పాఠశాల పరిస్థితి ద్వారా తెలుస్తోందని వ్యాఖ్యానించారు. తమ తండ్రి ఆశయాల సాధన కోసమే రాజకీయాల్లో ఉన్నామని చెప్పే నాయకులు ఈ పాఠశాల విషయంలో ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన నాయకులు ఆయా వర్గాల పిల్లల భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలని అన్నారు. ఈ అంశంపై ప్రజలు, మేధావులు స్పందించాలని పుట్ట మధుకర్ కోరారు.

తాండూరులో అక్రమ వెంచర్ కలకలం

- బారీ ఆరోపణలు.. అధికారుల మౌనంపై ప్రశ్నలు!
- 3 ఎకరాల వ్యవసాయ భూమిలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు!
- సామాన్యులకు నోటీసులు.. వెంచర్ పనులపై చర్యలేవీ?



ప్రజావాయిస్/తాండూరు:తాండూరు–కొడంగల్ రహదారిలోని బైపాస్ పక్కన మున్సిపల్ పరిధిలో సుమారు 3 ఎకరాల వ్యవసాయ భూమిలో అనుమతులు లేకుండానే వెంచర్ పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. సర్వే నంబర్లు 4/అ/1/1/2 (2 ఎకరాలు), 4/అ/1/2 (1 ఎకరం)లోని భూమిని ఇటీవల రతన్‌జీ కొనుగోలు చేసినట్లు సమాచారం.గత వారం, పది రోజులుగా ఈ భూమిలో రోడ్లు, డ్రైనేజీలు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే సదరు భూమి భూభారతి రికార్డుల్లో ఇప్పటికీ వ్యవసాయ భూమిగానే నమోదై ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

సామాన్యులకో నిబంధనలు.. పెద్దలకో నిబంధనలు?

మున్సిపల్ పరిధిలో రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకునే సామాన్యులకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు, మూడు ఎకరాల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంచర్ పనులపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జి అధికారి మౌనిక ఈ వ్యవహారంపై స్పందించకపోవడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.వ్యవసాయ భూమిలో వెంచర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు తీసుకున్నారా? భూమి వినియోగ మార్పిడి జరిగిందా? మున్సిపల్ లేఅవుట్ అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

విచారణకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు?

ఈ వ్యవహారంపై ప్రతిపక్ష పార్టీలు పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భూమి రికార్డులు, లేఅవుట్ అనుమతులు, నిర్మాణ పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవాలను వెల్లడించి, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గద్దె కూల్చినా..గుండెల్లో అభిమానం చెరపలేరు.!

- నిజాయితీగూడెంలో బీఆర్ ఎస్ జెండా గద్దె ధ్వంసం
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు
- నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రజావాయిస్, మానకొండూర్: బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెను కూల్చివేసినంత మాత్రాన ప్రజల మనసుల్లో ఉన్న అభిమానాన్ని చెరపలేరని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం నిజాయితీగూడెంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బీఆర్ఎస్ జెండా గద్దెను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై స్థానిక నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.విషయం తెలుసుకున్న జి.వి. రామకృష్ణారావు బుధవారం ఉదయం గ్రామానికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీగూడెం గ్రామంలో విద్యావంతులు, చురుకైన కార్యకర్తలు పార్టీ పట్ల అభిమానంతో ఉన్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణకు చేసిన సేవలను ప్రజలు గుర్తుంచుకున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ గ్రామీణ ప్రజలతో మమేకమైన పార్టీని ఇలాంటి చర్యలతో ప్రజలకు దూరం చేయలేరన్నారు.జెండా గద్దెను ధ్వంసం చేసిన వారిని పోలీసులు వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



గుంతల రోడ్డుతో ప్రయాణ నరకం.!

- అర్ధాంతరంగా నిలిచిన ఫోర్ లేన్ పనులు
- సీఎం రేవంత్ రెడ్డి పర్యటన తోనైనా కదలిక వస్తుందా.?
- రోడ్డు పనులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ప్రజల విజ్ఞప్తి

ప్రజా వాయిస్ / సిద్దిపేట: గుంతలమయమైన రహదారి.. నిత్యం నరకప్రాయమైన ప్రయాణం.. అర్ధాంతరంగా నిలిచిన ఫోర్‌లేన్ నిర్మాణ పనులు.. ఇదీ సిద్దిపేట ప్రాంతంలోని రహదారి దుస్థితి. రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఫోర్‌లేన్ పనులు.. ప్రభుత్వం మారిన తర్వాత ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడటంతో ప్రయాణం కష్టతరంగా మారింది. నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి దుస్థితిపై తమ నిరసనను ఫ్లెక్సీ ద్వారా వ్యక్తం చేస్తూ.. పాలకులు స్పందించాలని కోరుతున్నారు.

సీఎం పర్యటనతోనైనా మోక్షం లభించేనా.?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట పర్యటనకు వస్తున్న నేపథ్యంలో స్థానికుల్లో రహదారి సమస్యపై ఆశలు చిగురిస్తున్నాయి. సీఎం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, నిలిచిపోయిన ఫోర్‌లేన్ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గుంతల రోడ్డు కష్టాలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాత్రికి రాత్రే మారిన రంగు

- ముథోల్ రాజకీయాల్లో 'కండువా' హైడ్రామా!
- ఒకే రోజు వ్యవధిలో బీఆర్ఎస్ నుండి తిరిగి బీజేపీ గూటికి చేరిన సర్పంచులు
- మాయమాటలు చెప్పి తప్పుదోవ పట్టించారంటూ సర్పంచుల యూ-టర్న్
- యోజకవర్గంలో ఆధిపత్య పోరుకు నిదర్శనమా.. లేక రాజకీయ ఒత్తిళ్ల ప్రభావమా?
- రసవత్తరంగా మారిన ముథోల్ రాజకీయాలు
- ప్రజల్లో ఆసక్తికర చర్చ

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ,నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలో మాత్రం బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల మధ్య రసవత్తరమైన రాజకీయ క్రీడ నడుస్తోంది.ముఖ్యంగా గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచుల పార్టీ మార్పులు ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.నిన్నటి వరకు ఒక పార్టీ కండువా కప్పుకున్న సర్పంచులు,రాత్రికి రాత్రే మనసు మార్చుకుని మరుసటి రోజు ఉదయాన్నే తిరిగి పాత గూటికి చేరడం స్థానిక రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

అసలేం జరిగింది?

ముథోల్ నియోజకవర్గ పరిధిలోని సర్పంచ్ లు సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడం స్థానికంగా సంచలనం సృష్టించింది. అయితే,ఈ ఆనందం బీఆర్ఎస్ శ్రేణులకు ఎంతోసేపు నిలవ లేదు.24 గంటలు గడవకముందే,బుధవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సమక్షంలో వారు తిరిగి కాషాయ కండువా కప్పుకున్నారు.తాము ఎప్పటికీ బీజేపీలోనే ఉంటామని,ఎమ్మెల్యే వెంటే నడుస్తామని ప్రకటించారు.

సర్పంచుల యూ-టర్న్ వెనుక ఆంతర్యమేమిటి?

కండువాలు మార్చుకున్నప్పుడు ఉన్న ఉత్సాహం,మరుసటి రోజు ఉదయానికి ఎందుకు మారిందనే ప్రశ్న నియోజకవర్గ ప్రజలను తొలుస్తోంది. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి తప్పుదోవ పట్టించారా? కేటీఆర్ వద్ద మెప్పు పొందడం కోసమే స్థానిక బీఆర్ఎస్ నేతలు తమను మాయమాటలు చెప్పి తీసుకెళ్లారని,అనుకోకుండా ఆ ఘటన జరిగిందని సర్పంచులు చెబుతున్నారు.అయితే, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులకు కండువా వేసుకునేటప్పుడు తెలియదా....? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు....!నిధులు, ఒత్తిళ్ల భయమా..?నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ బీజేపీకి చెందినవారు కావడంతో,పార్టీ మారితే గ్రామ అభివృద్ధికి నిధులు ఆగిపోతాయనే భయం లేదా స్థానిక బీజేపీ క్యాడర్ నుండి వచ్చిన తీవ్ర ఒత్తిడి వల్లే వారు వెనక్కి తగ్గారనే చర్చ బలంగా నడుస్తోంది.

ఎవరి గ్రాఫ్ పెరిగింది? ఎవరిది తగ్గింది?

ఈ 'ఆపరేషన్ ఆకర్ష్' మరియు 'రివర్స్ ఆపరేషన్' వెనుక ఇరు పార్టీల ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది.నియోజకవర్గంలో తమ పట్టు తగ్గలేదని, బీఆర్ఎస్ వైపు వలసలు ఉన్నాయని నిరూపించుకోవడానికి గులాబీ నేతలు ప్రయత్నించగా.తమ క్యాడర్ చెక్కుచెదరలేదని, ఎమ్మెల్యే పట్టు ఏమాత్రం తగ్గలేదని చాటుకోవడానికి బీజేపీ నేతలు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, ముథోల్ గడ్డపై మాత్రం బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోరు సాగుతోందని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. చిన్నపిల్లలకు చాక్లెట్లు ఇచ్చినట్లు కండువాలు మార్చడం,ఆపై మాయమాటలంటూ సాకులు చెప్పడం వంటి పరిణామాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ముథోల్ రాజకీయాలను మరింత వేడెక్కించడం ఖాయంగా కనిపిస్తోంది.







నేలకొండపల్లిలో మూడేళ్లుగా మూలనపడ్డ గ్రంథాలయ భవనం!

- జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాల ఆర్భాటాలు
- గ్రామాల్లో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు!
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- పిచ్చిమొక్కల అడ్డగా గ్రంథాలయ భవనం!
- చైర్మన్ వచ్చి నెలలు గడుస్తున్నా మారని వైనం
- వారోత్సవాల ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో కనిపించని అభివృద్ధి!

ప్రజా వాయిస్ ఖమ్మం:ఒకవైపు ఖమ్మం జిల్లా కేంద్రంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా యోగా కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వేదికలపై గ్రంథాలయాల అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటూ ఫోటోలకు ఫోజులిస్తున్నారు. కానీ, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండల కేంద్రంలో మాత్రం గ్రంథాలయ భవన పరిస్థితి చూస్తే వీరు చేస్తున్న ఆర్భాటం ఎవరి కోసం అనే ప్రశ్నార్థకం కలుగుతోంది.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను నియమించి నెలలు గడుస్తున్నప్పటికీ, ఆయన పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. జిల్లా కేంద్రంలో ఉత్సవాలు, యోగాలతో కాలక్షేపం చేస్తున్న అధికారులు, మారుమూల మండలాలైన నేలకొండపల్లి వంటి చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాల వైపు కనీసం కన్నెత్తి చూడకపోవడం దారుణం. ఇదిగో నేలకొండపల్లిలో మూడేళ్లుగా మూలనపడ్డ గ్రంథాలయ భవనమే ఇందుకు సాక్ష్యం.

కేవలం ఆర్భాటాలు, ప్రకటనలకే తప్ప, ఆచరణలో ఒరిగింది ఏమీ లేదంటూ సర్వత్రా తీవ్ర చర్చ జరుగుతోంది.మండల కేంద్రంలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభమై మూడేళ్లు దాటుతున్నా నేటికీ కొలిక్కి రాలేదు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి, శిథిలావస్థను తలపిస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు, విద్యార్థులు చదువుకోవడానికి సరైన వసతి లేక నానా తంటాలు పడుతుంటే, చైర్మన్‌గానీ, స్థానిక పాలకులుగానీ దీనిని పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం జిల్లా కేంద్రంలో వారోత్సవాలు, సభలు, సమావేశాల పేరుతో గొప్పలు చెప్పుకోవడం తప్ప, గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధిని గాలికొదిలేశారన్న ఆరోపణలు తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి.

ఇందిరా సొసైటీ....అక్రమాల సొసైటీ

- ఉద్యోగుల ఇళ్ల స్థలాల్లో పరిశ్రమలు, గోదాముల ఏర్పాటు
- సొసైటీ భూముల వినియోగంపై అనేక అనుమానాలు
- సర్వే నంబర్లు 76 నుంచి 86 వరకు నిర్మాణాలపై స్థానికుల ఆరోపణలు
- అక్రమ షెడ్లపై చర్యలు తీసుకుంటామన్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్





జావాయిస్|| రాజేంద్రనగర్: ప్రభుత్వ ఉద్యోగులకు సొంతింటి కల సాకారం చేయాల్సిన ఇందిరాగాంధీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ భూములు ఇప్పుడు పారిశ్రామిక అవసరాలకు వేదికగా మారుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అత్తాపూర్ జిహెచ్ఎంసి సర్కిల్ కాటేదాన్ పరిధిలో ఉన్న సొసైటీ భూముల్లో నివాసాల స్థానంలో పరిశ్రమలు,గోదాములు, భారీ షెడ్లు వెలుస్తున్నాయంటూ స్థానికులు అంటున్నారు. సొసైటీ రిజిస్ట్రేషన్ నంబర్ టి.బి-823 కాగా,సర్వే నంబర్లు 76 నుంచి 78 వరకు,80 నుంచి 86 వరకు ఉన్న భూముల వినియోగంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల గృహ నిర్మాణాల కోసం ఉద్దేశించిన స్థలాల్లో పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగించేందుకు అనుమతులు ఎవరిచ్చారు.? భూ వినియోగం మార్చారా.? నిర్మాణాలకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్నాయా.? కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందారా.? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

ఉద్యోగుల సొసైటీ భూములు -- వ్యాపార అవసరాలకు మళ్లాయా?

సొంతింటి కోసం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన మంత్రి దివంగత నేత ఇందిరాగాంధీ హయాంలో కేటాయించిన భూములు ఇతర అవసరాలకు వినియోగంలోకి వస్తున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.భూముల కేటాయింపులు, యాజమాన్య హక్కులు, క్రయవిక్రయాలు,నిర్మాణ అనుమతులపై సంబంధిత శాఖలు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం: ఏసీపీ శ్రీధర్



ఈ వ్యవహారంపై అత్తాపూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఏసీపీ శ్రీధర్ స్పందిస్తూ, సొసైటీ భూముల్లో షెడ్ల నిర్మాణాల తోపాటు భవన నిర్మాణాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే నోటీసులు జారీ చేసి, అనంతరం చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



నిజాంపేట్-జహీరాబాద్ రహదారి అధ్వానం

- కొత్త రోడ్డుకే గుంతల ముప్పు!

ప్రజా వాయిస్ నిజాంపేట్.నిర్మాణంలో నాణ్యత లోపమా? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? అధికారుల పర్యవేక్షణ ఏది? సంగారెడ్డి జిల్లా నిజాంపేట నుండి జహీరాబాద్ కు వెళ్లే రహదారి ఇటీవలే కొత్తగా నిర్మించినప్పటికీ, కొద్దికాలంలోనే రోడ్డు నాణ్యత దెబ్బతినడం పై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు ప్రజాధనంతో నిర్మించిన రహదారి అలా అధ్వానంగా మారటం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారిపై ప్రయాణించే ప్రజలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు రహదారిని పరిశీలించి, నాణ్యత పరీక్షలు నిర్వహించి, లోపాలు బయటపడితే బాధ్యులైన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజాధనం వృధా కావటానికి కారణం ఎవరు? నాసిరకం పనులు చేసిన పట్టించుకునే నాధుడే లేరా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఎస్సై ఉక్కుపాదం

- ట్రాక్టర్ సీజ్.. కేసు నమోదు

ప్రజావాయిస్/పెద్దేముల్: తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.పోలీసుల కథనం ప్రకారం.. నవంబర్ 16వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కందెనెల్లి గ్రామ శివారులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.దీంతో పెద్దేముల్ ఎస్సై ఎం. ప్రశాంత్ వర్ధన్ తన సిబ్బందితో కలిసి కందెనెల్లి గ్రామ శివారులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రశాంత్ వర్ధన్ హెచ్చరించారు.





హామీలిచ్చి హ్యాండిచ్చారు.. కాంగ్రెస్‌పై భాస్కర్ రావు ఫైర్

- ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో వైఫల్యం
- హామీల ప్రతులను చించి చెత్తబుట్టలో వేసి బీఆర్ఎస్ నిరసన

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమోతు భాస్కర్ రావు విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. బుధవారం మిర్యాలగూడలోని రెడ్డి కాలనీలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చ లేదని, కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఆరు గ్యారెంటీలు, 420 హామీల ప్రతులను చించి చెత్తబుట్టలో వేసి నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు.నాగార్జునసాగర్ డ్యామ్‌లోని డెడ్‌స్టోరేజీ నీటిని ఏపీకి తరలించే ప్రయత్నాలను అడ్డుకోవాలని, తెలంగాణ రైతుల నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే కామారెడ్డి బీసీ డిక్లరేషన్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లను తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, ఎండీ యూసుఫ్, దుర్గంపూడి నారాయణ రెడ్డి, చిట్టిబాబు నాయక్, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌నినో హెచ్చరికలు బేఖాతర్.!

- యాసంగిలోనూ వరి వైపే రైతుల చూపు
- నీటి గ్యారంటీ లేకున్నా సాగుకు సై.. ఇప్పటికే నారుమళ్ల సిద్ధం
- కరెంటు కోతలొచ్చినా.. జనరేటర్లతోనైనా సాగు చేస్తామంటున్న అన్నదాతలు

ప్రజావాయిస్, పెన్‌ప హాడ్: ఒకవైపు ఎల్‌నినో గండం.. మరోవైపు సాగునీటి కొరత భయం.. ఇంకోవైపు అధికారులు ప్రత్యామ్నాయ పంటలే సాగు చేయాలంటూ సూచనలు! అయినా రైతుల తీరు మారడం లేదు. యాసంగిలోనూ వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. నీటి లభ్యతపై స్పష్టత లేకపోయినా, వర్షాలు అనుకూలిస్తాయన్న ఆశతో ఇప్పటికే నారుమళ్ల పనులు మొదలు పెట్టారు. అవసరమైతే విద్యుత్ కోతలను అధిగమించేందుకు జనరేటర్లు ఏర్పాటు చేసుకునైనా వరి పండిస్తామంటున్నారు. దీంతో ప్రకృతి హెచ్చరికలు ఒకవైపు.. రైతుల ఆశలు మరోవైపు అన్నట్లుగా యాసంగి సాగు పరిస్థితి మారింది.



ఎల్ నినో ఎఫెక్ట్ ..రైతుల్లో టెన్షన్

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయన్న వాతావరణ శాఖ అంచనాలు వ్యవసాయ రంగంలో కలవరం రేపుతున్నాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇవి మరింత బలపడే అవకాశాలున్నాయన్న అంచనాలతో వర్షాపాతంపై అనిశ్చితి నెలకొంది. నీటి వనరుల లభ్యత తగ్గే ప్రమాదం ఉండటంతో వరికి బదులుగా ఆరుతడి, మెట్ట పంటలు సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి సైతం ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరుతున్నారు.

వరి సాగుపైనే గురి.!

అధికారుల సూచనలు రైతుల సాగు నిర్ణయాలను మార్చలేక పోతున్నాయి. వరి సాగుపై అనుభవం, ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్, ధర లభిస్తుందన్న ఆశతో ఎక్కువ మంది రైతులు వరి వైపే అడుగులు వేస్తున్నారు. నీటి సమస్య ఎదురైతే ఇతర మార్గాల్లో సాగునీరు సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా జనరేటర్ల సాయంతో పంటను కాపాడుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నారుమళ్లతో హడావుడి..

మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే రైతులు నారుమళ్ల పనులు ప్రారంభించారు. ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నీటి లభ్యతపై స్పష్టత లేకున్నా సాగుకు సన్నద్ధమవుతున్నారు. వర్షాలు ఆశాజనకంగా కురుస్తాయన్న నమ్మకంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎల్‌నినో ప్రభావం ఎంతమేర ఉంటుంది. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఎంతవరకు సహకరిస్తాయి. అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగుకే పట్టుబడుతుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రకృతి సహకరిస్తుందా.. రైతుల ఆశలు నెరవేరుతాయా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.



ప్రజా వాయిస్

ఐఎంఏ వైద్యుల తనిఖీల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి?

చిన్నాసుపత్రులపైనే జులుం.!

- కార్పొరేట్ ఆసుపత్రులపై కొరవడిన తనిఖీలు
- మెడికల్ కౌన్సిల్ అధికారుల తీరుపై విమర్శలు

ప్రజా వాయిస్ – హన్మకొండ జిల్లా ప్రతినిధి:హన్మకొండలో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ అధికారుల తనిఖీల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ఎంపీ ఆసుపత్రులపై విస్తృత తనిఖీలు చేస్తున్న అధికారులు.. కార్పొరేట్ ఆసుపత్రుల విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇష్టానుసారంగా ఓపీ ఫీజులు వసూలు చేస్తున్నా, నిబంధనల అమలుపై ఫిర్యాదులు వస్తున్నా తనిఖీలు లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని ఆసుపత్రులపై సమానంగా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మాయదారి వడ్డీ వ్యాపారాలు!?

- ఏజెన్సీలో రోడ్డున పడుతున్న చిన్న చితకా కుటుంబాలు!
- తీసుకున్న రొక్కం నికి అప్పు కట్టలేక వస్తువులు తాకట్టు పెడుతున్న గిరిజనలు?
- నూటికి 10 రూపాయల నుండి 15 రూపాయల వరకు వసూళ్లు
- సకాలంలో బ్యాంకర్స్ సహకరించక రోజువారి వడ్డీ వైపు చూపు!?
- కొన్నిచోట్ల ప్రాంసర నోటు ఆధారంగా ఆస్తులు స్వాహాలు!
- ఏజెన్సీ ప్రాంతంలో కోట్లకు పడగెత్తుతున్న భూస్వాములు?
- వ్యవసాయంపై లక్ష రూపాయల నుండి 10 లక్షల వరకు వ్యాపారం
- పామాయిల్ తోటలను గుప్పిట్లో పెట్టుకుంటున్న వడ్డీ వ్యాపారస్తులు



ప్రజా వాయిస్ అశ్వారావు పేట స్పెషల్ స్టోరీఏజెన్సీ ప్రాంతాల్లో మాయదారి వడ్డీ వ్యాపారాలకు చిన్నచిత కుటుంబాలు సైతం రోడ్డున పడుతున్న సందర్భాలు అనేకంగా దర్శనమిస్తున్నాయి. తీసుకున్న రొక్కానికి అప్పు కట్టలేక వస్తువులను సైతం తాకట్టు పెట్టుకుంటున్న భూస్వాములు కోట్లు పడగెత్తుతున్నారు నూటికి పది రూపాయల నుండి 15 రూపాయల మేరకు వసూళ్లు చేయటంతో చేసేదేమీ లేక మౌనం వహిస్తున్నారు సకాలంలో బ్యాంకర్స్ వ్యవసాయనికి సహకరించక పోవడంతో రోజువారి వడ్డీ వైపే చూసే పరిస్థితి ఏర్పడుతుంది వ్యవసాయంపై లక్ష రూపాయల నుండి పది లక్షల రూపాయల వరకు వడ్డీ వ్యాపారాలు పెట్టడం బాధితులు కట్టని యెడల పశువులతో పాటు స్థలాలను మరియు అవసరమైన సందర్భంలో పామాయిల్ పంటలను స్వాధీనం చేసుకొని అప్పు తీరే అంతవరకు వారి ఆధ్వర్యంలో ఉంచుకొని సొమ్ము చేసుకుంటున్నారే తప్ప ఐదేళ్లయిన పదేళ్ల యిన అప్పు తీరింది అన్న మాట ఊసే ఉండదని బాధితులు సైతం వాపోతున్న ఘటనలు మండలంలో సంచలన సృష్టిస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల పరిధిలోని నారాయణ గూడెం, అచ్యుతాపురం, ఆసుపాక, వినాయకపురం, జమ్మిగూడెం, నారాయణపురం, రామన్నగూడెం, అనంతారం, కంట్లం, కన్నాయిగూడెం. వంటి ప్రాంతాలలో ప్రతి గ్రామంలోని ఒక్కొక్క వడ్డీ వ్యాపారస్తులకు బినామీగా ఊరుల్లో ఓ వ్యక్తిని ఏర్పాటు చేసుకొని వాళ్ళ ద్వారా మారుమూల ప్రాంతానికి చెందిన భూస్వామి వడ్డీ వ్యాపారాలు యదేచ్ఛగా కొన సాగిస్తున్నారు. వ్యవసాయానికి లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయల మేరకు అందించినప్పటికీ నూటికి పది రూపాయల నుండి 15 రూపాయల మేరకు వడ్డీ వసూళ్లకు పాల్పడుతున్నారని తీసుకున్న ధనము తీరని ఎడల వస్తువును జీవరాసినో లేక పొలాలను స్వాధీనం చేసుకొని వారు పైకం చెల్లించని యెడల వాటిని స్వాధీనం చేసుకొని వారి ఆధ్వర్యంలోని వాటిని చూసుకోవటం గమనర్హం నిజానికి వ్యవసాయానికి ప్రధానంగా ప్రకృతి అయిన వాతావరణ సహకరించాలి ఆరు నెలల సమయంలో పంటచేతుకొచ్చే సమయానికి ప్రకృతి ప్రలయాలకి ధ్వంసం అయితే వడ్డీ వ్యాపారస్తులకు పండగే పండగ ఎందుకంటే అసలు కట్టలేక వడ్డీల పై వడ్డీలు పెరిగి చివరికి తీసుకున్న అప్పు కొండంత భారంగా కనిపించడంతో వస్తువుని తిరిగి చెల్లించే పరిస్థితి కనిపించడంతో ఆ సంతోషానికి వ్యాపారస్తులకు హద్దు అదుపు లేకుండా పోతుంది.

ఏజెన్సీలో వారు చెప్పిందే న్యాయం!?

ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న అమాయక గిరిజనులు తమ అవసరాల నిమిత్తం వ్యాపారస్తులను నమ్ముకునే పరిస్థితి కనిపిస్తుంది. అట్టి సందర్భంలో వడ్డీ వ్యాపారస్తులు వద్దనుండి గిరిజనలు కొంత నగదును తీసుకొని వ్యవసాయం పన్నుపిమట మరల ధాన్యము లేక నగదు చెల్లిస్తామని హామీ పత్రాలపై కేవలం



సంతకాలు మాత్రమే చెల్లించి వారికి బానిసైపోవటం సర్వసాధారణ అవుతుంది అంతేకాకుండా వడ్డీ వ్యాపారస్తులు మొదటి రోజునే నూటికి పది రూపాయలు నుండి 15 రూపాయలు అని ఒప్పందాన్ని కుదుర్చుకున్న పిమ్మటే గిరిజనులకు ధనము ఇచ్చేందుకు అంగీకరిస్తానట్లు తెలుస్తుంది ఇక వ్యవసాయం పేరుతో పంట పంటకపోయినా వానలు కురవపోయిన పంట సేనుకు ఎరువులు వేయాల్సి వచ్చిన లేక మొదటి విడతలు దుక్కులు దున్నే సందర్భంలోనైనా వ్యాపారస్తులను సంప్రదిస్తే వెంటనే వారికి నగదు మంజూరు చేస్తున్నామని చెప్పటం వారు వద్ద నుండి ఒప్పంద పత్రాలు పై సంతకాలు చేయించుకోవడం తదుపరి వారికి నగదును చెల్లించడం పండిన పంట పండక పోయిన వారికి జంతువును పంట పొలాల్లో చెల్లించే విధంగా తదుపరి ఒప్పంద పత్రాలపై రాసుకొని పొలాలను స్వాధీనం చేసుకోవడం వెన్నతో పెట్టిన విద్యగా మారింది.

వందల ఎకరాలు ఆ భూస్వామి చేతిలోనే!?

ఏజెన్సీ ప్రాంతంలోని ఉన్న భూములలో సక భాగం వడ్డీ వ్యాపారస్తుల చేతుల్లోనే మెసులుతున్నాయని భారీగా ప్రచారం లేకపోలేదు పంట పండక పోతే భూమిని స్వాధీనం చేసుకోవడం కాకుండా మరలా వారిని రోజువారి కూలీలుగా మార్చి కాలం గడిపేస్తున్నారు. అటువంటి భూస్వాములు చేతుల్లో వందల నుండి వేల ఎకరాలు ఉన్నట్లు అంతేకాకుండా వాటిలో కొంత పామాయిల్ తోటలు పండిస్తు



స్నట్లు విశ్వసినీయ సమాచారం.

బ్యాంకర్లు సహకరించకపోవడంతో వడ్డీ వ్యాపారస్తులు వైపు చూపు!?

అశ్వారావుపేట పట్టణంలోని అనేక ప్రభుత్వ సెక్టార్ల బ్యాంకులో ఉండటం వ్యవసాయ నిమిత్తం లోన్లు మంజూరు చేయకపోవడం తో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అమాయక గిరిజనులు వడ్డీ వ్యాపారస్తుల వైపే తొంగు చూసే పరిస్థితి కని పిస్తుంది అంతేకాకుండా వ్యవసాయాన్ని ప్రారంభించే దిశ నుండి ముగింపు దిసే వరకు అంతా పెట్టుబడితో కూడుకొని ఉండటంతో కుటుంబాలు గడవక అప్పు పుట్టక బ్యాంకర్లు సహకరించకపోవడంతో వడ్డీ వ్యాపారస్తుల్ని నమ్ముకున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా వ్యవసాయానికి అలవాటు పడిన మధ్యతరగతి కుటుంబాలు గిట్టుపాటు ధర లేక ఎరువులు రేట్లు పెరుగుదల కౌవులు భూముల రేట్లు అధికం కావడంతో మక్కువ వీడలేని మధ్యతరగతి కుటుంబాలు వ్యవసాయాన్ని నమ్ముకుని రోడ్ లో పడుతున్నాయని ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి బ్యాంకర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి సకాలంలో లోన్లు మంజూరయ్యే విధంగా ప్రజాప్రతినిధులు అధికారులు సహకరించాలంటూ మధ్యతరగతి కుటుంబాలు బాధితులు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాయి.

40 ఎకరాల అప్పచెరువు నాలుగు ఎకరాలకే పరిమితమా.?



- ఆక్రమణలకు గురవుతున్న గగన్ పహాడ్ అప్పచెరువు
- కనుమరుగైన సహజ నీటి ప్రవాహ మార్గాలు
- హైడ్రాకు కనిపించడం లేదా..?
- గతంలో ఆక్రమణలు తొల గించిన అధికారులు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు.?
- చెరువును సర్వే చేసి ఎఫ్ టీఎల్,బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేయాలనిబీఆర్ఎస్ నేతల డిమాండ్

జావాయిస్||రాజేంద్రనగర్:నగర శివారులోని గగన్‌పహాడ్ అప్పచెరువు ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ లు 178,89, 90 లో సుమారు 40.13 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు ప్రస్తుతం నాలుగు ఎకరాల మేరకే కనిపిస్తోందని, చెరువు పరిసరాల్లో ఆక్రమణలు,మట్టి నింపడం, సహజ నీటి ప్రవాహ మార్గాలు కనుమరుగవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు.హెచ్ఎండీఏ లేక్స్ డేటాబేస్‌లో 2900-25-002 ఐడీతో నమోదైన చెరువు పరిరక్షణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరారు.ఇటీవల బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో చెరువును పరిశీలించి పరిస్థితులను గుర్తించారు. గతంలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల తొలగింపులో చర్యలు చేపట్టిన హైడ్రా ప్రస్తుతం అప్పచెరువు విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. హెచ్ఎ ండీఏ , రెవెన్యూ,ఇరిగేషన్,రైల్వే శాఖల అధికారులు సమ న్వయంతో స్పందించాలని డిమాండ్ చేశారు.చెరువు పూర్తి స్థాయి సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ హద్దులు గుర్తించాలని, హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని,ఆక్రమణలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం తొలగించాలని కోరారు. మురుగునీరు,చెత్త చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పాత తూములు, కాలువలు,సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.చెరువును పరిరక్షించి అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నాయకులు సరికొండ దుర్గేష్,ఎర్రోళ్ల యాదయ్య, ఈర్లపల్లి ప్రవీణ్,వల్లూరి నాగేష్,కరెంకోటి హనుమానిజీ, వల్లూరి విజయ్,తదితరులు అప్పచెరువును పరిశీలించిన వారిలో ఉన్నారు.





ఫార్మసిస్ట్ లేకుండానే మెడికల్ షాపుల నిర్వహణ!

- జనగామ జిల్లాలో నిబంధనల ఉల్లంఘనలపై ఉన్నతాధి కారులు స్పందించాలి
- డ్రగ్ ఇన్ స్పెక్టర్ తీరుపై సమగ్ర విచారణ జరపాలి
- ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెజగం అశోక్



జా వాయిస్/జనగామ జిల్లా జనగామ జిల్లాలో అర్హత కలిగిన రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ప్రత్యక్ష పర్యవేక్షణ లేకుండానే కొన్ని మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు బెజగం అశోక్ డిమాండ్ చేశారు. ఔషధాల విక్రయంలో నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటే ప్రజల ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామానికి చెందిన అశోక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో కొన్ని మెడికల్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కొంతమంది మెడికల్ షాపుల యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు తీసుకుంటూ ఉల్లంఘనలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలపైనా ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. ఈ ఆరోపణలపై వాస్తవాలను వెలికితీసి, తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఫార్మసిస్ట్ పాత్రను విస్మరించొద్దు..

ఫార్మసిస్ట్ అనేవారు కేవలం మెడికల్ షాపు లైసెన్స్‌కు పరిమితమైన వ్యక్తి కాదని, రోగులకు సరైన ఔషధాలు అందించడం, మందుల వినియోగంపై తగిన సూచనలు ఇవ్వడం వంటి కీలక బాధ్యతలు నిర్వహించే ఆరోగ్య నిపుణులని అశోక్ పేర్కొన్నారు. అర్హత కలిగిన రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ వాస్తవంగా విధుల్లో ఉన్నారా లేదా అన్నది అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఫార్మసిస్టుల రిజిస్ట్రేషన్ వివరాలను దుర్వినియోగం చేస్తూ నిబంధనలను ఉల్లంఘించే విధానాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

సంఘం ప్రధాన డిమాండ్లు ఇవే..

జనగామ జిల్లాలోని అన్ని మెడికల్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, రిజిస్టర్డ్ ఫార్మసిస్టులు వాస్తవంగా విధులు నిర్వహిస్తున్నారా లేదా నిర్ధారించాలని అశోక్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మెడికల్ షాపులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విధుల నిర్వహణపై వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని కోరారు. అక్రమ వసూళ్లు జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజల ఆరోగ్య భద్రతను పరిరక్షించడం, ఫార్మసిస్ట్ వృత్తి గౌరవాన్ని కాపాడటం తమ సంఘం ప్రధాన లక్ష్యమని బెజగం అశోక్ తెలిపారు. ఔషధాల విక్రయంలో పారదర్శకత, చట్టబద్ధతను నిర్ధారించేందుకు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం తన పోరాటాన్ని కొనసాగిస్తుందని వెల్లడించారు.



భక్తికి బాసటగా మిట్టపల్లి

- 1,200 మంది స్వాములకు ఉచిత రైలు
- సొంత ఖర్చులతో శబరిమల యాత్రకు ప్రత్యేక రైలు ఏర్పాటు
- ఈ నెల 28లోగా పేర్ల నమోదు
- డిసెంబర్ 22న మిర్యాలగూడ నుంచి ప్రయాణం

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లాలనే భక్తుల ఆకాంక్షకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదన్న సంకల్పంతో యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్ వినూత్న సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని అయ్యప్ప మాలధారణ స్వాముల కోసం తన సొంత ఖర్చులతో ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 1,000 నుంచి 1,200 మంది స్వాములకు ఉచిత రైలు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ప్రకటించారు.బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని వైదేహి టౌన్‌షిప్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాముల పవిత్ర శబరిమల యాత్రలో ప్రయాణ ఖర్చులు భారంగా మారకూడదనే ఉద్దేశంతో రైలు ప్రయాణానికి అయ్యే ఖర్చుల న్నింటినీ తానే భరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మాలధారణ స్వాములందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డిసెంబర్ 22న మిర్యాలగూడ నుంచి బయలుదేరే ప్రత్యేక రైలు చెంగనూరుకు చేరుకుంటుందని, తిరిగి డిసెంబర్ 25న చెంగనూరు నుంచి మిర్యాలగూడకు చేరుకుంటుందని వెల్లడించారు.యాత్రకు వెళ్లాలనుకునే స్వాములు ఈ నెల 28వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పూర్తి వివరాలతో మిర్యాలగూడలోని వైదేహి టౌన్‌షిప్‌లో ఉన్న తన నివాసంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 8142782580, 9014592580 నంబర్లను సంప్రదించాలని కోరారు.అనంతరం అయ్యప్ప గురుస్వాములతో కలిసి ప్రత్యేక రైలు ఏర్పాట్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి మాశెట్టి శ్రీనివాస్ డైమండ్‌తో పాటు పలువురు స్వాములు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని వీపనగండ్ల ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల నిరసన

- కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి
- ప్రైవేట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి
- కార్మికుల సేవలను ప్రశంసిస్తున్న ప్రభుత్వం వారి వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది



ప్రజా వాయిస్.. వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పాలకులకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా గత ఏడు రోజులుగా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు చేపడుతున్న ఆందోళనలో భాగంగా బుధవారం వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ,,, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, ప్రైవేట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. పండుగలు, జాతీయ పర్వదినాల సెలవులను వర్తింపజేయడంతో పాటు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.రోగుల మలమూత్రాలను శుభ్రం చేస్తూ, ఆసుపత్రుల్లో నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు మాత్రం ఆర్థిక ఇబ్బందులతో అస్తవ్యస్తంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సేవలను ప్రశంసిస్తున్న ప్రభుత్వం వారి వేతనాలు పెంచడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఇప్పటికే పలుమార్లు నిరసనలు, ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు.ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ కాంట్రాక్టు కార్మికులు దయాకర్, గణేష్, అనిల్, మన్నెమ్మ, లింగమ్మ, పార్వతమ్మ, అలివేలు, రేణుక, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సంస్కర్తలు జర్నలిస్టులు

ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షురాలు నరేందుల సాహితి ఘనంగా జర్నలిస్టులకు సన్మానం



ప్రజా వాయిస్, లక్షెట్టిపేట

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట లో ఏర్పాటు చేసిన సమావేశములో సామాజిక సంస్కర్తలు జర్నలిస్టులని, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారదులుగా ఉంటూ ఎల్లవేళలా ప్రజా సంక్షేమానికి పాటుపడేవారు జర్నలిస్టులని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ముఖ్య సలహాదారు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, జిల్లా అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య భవన్ లో జర్నలిస్టు డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది పాత్రికేయులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమైందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, నిజాన్ని నిర్భయంగా రాస్తూ సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు పాటు పడుతున్నారని అన్నారు. జర్నలిస్టులు కూడా ఐక్యతతో ముందుకు పోయి తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు నరేందుల సాహితి మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజలకు చేరవేస్తూ వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజలకు నిజా నిజాలను తెలియజేయడంలో పాత్రికేయుల బాధ్యత ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షుడు మైలారపు సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో అన్యాయానికి గురవుతున్న నిరుపేదలకు జర్నలిస్టులు అండగా నిలుస్తున్నారని వారి సమస్యలను వార్తల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుండడం హర్షనీయమన్నారు. అనంతరం జర్నలిస్టులను మహిళా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి పల్లెర్ల ఆరతి, కోశాధికారి కాసం స్వప్న, పట్టణ సంఘం అధ్యక్షులు చెట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి నల్మాస్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓజ్జుల శ్రీనివాస్, కోశాధికారి నరేందుల రమేష్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గౌరిశెట్టి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొంజర్ల ప్రసాద్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పిఆర్ఓ కొంజర్ల శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షులు గడ్డం వికాస్ ప్రధాన కార్యదర్శి రంజిత్ , జిల్లా యువజన సంఘం ప్రధాన కార్యదర్శి బొద్దుకూరి రాజ్ కుమార్, మహిళా సంఘం, గౌరవ సలహాదారులు ఉత్తూరు రజిత, చెట్ల రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో ఆదుకున్న కాంగ్రెస్ నాయకుడు

మిట్టగడప సైదులు కుటుంబానికి వనపర్తి రామారావు ఆర్థిక సాయం

ప్రజా వాయిస్, చిలుకూరు:

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని బేతవోలు గ్రామానికి చెందిన మిట్టగడప సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు వనపర్తి రామారావు స్పందించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపద సమయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సాయం చేసినట్లు తెలిపారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి తోడుగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి రామారావు తరఫున వంగూరి రాంబాబు, మాజీ సర్పంచ్ తాళ్లూరి శ్రీను, రేమిడాల కృష్ణమూర్తి, వంగూరి రమేష్, మాచబోయిన పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలకు కొత్త అర్థం..
ఆశ్రమవాసులకు అండగా నిలిచిన తండ్రి

- సహన్వి జన్మదినం సందర్భంగా రగ్గులు, భోజనాల పంపిణీ..
- సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా తాటి విజయకుమారస్వామి

ప్రజా వాయిస్ మంథని

పిల్లల పుట్టినరోజులు అంటే కేక్ కటింగ్‌లు, వేడుకలు, ఆర్భాటాలు మాత్రమే కాదు.. నలుగురికి సాయం చేస్తూ ఆనందాన్ని పంచుకోవచ్చని చాటిచెప్పారు విజయ కుమార స్వామి. తన కుమార్తె తాటి సహన్వి పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం గోదావరిఖనిలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశ్రమంలోని వారికి రగ్గులు పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. పుట్టినరోజు వేడుకను సేవా కార్యక్రమంగా మలచడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ కుమార స్వామి గతంలోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారు. రెండు నెలల క్రితం



తన కుమారుడు తాటి సాయి వర్ధన్ పుట్టినరోజు సందర్భంగా ఐదు నిరుపేద కుటుంబాలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఇలా పిల్లల పుట్టినరోజులను ఇతరులకు ఉపయోగపడే సందర్భాలుగా మలుస్తూ తనదైన మార్గంలో ముందుకు సాగుతున్నారు. మరోవైపు సామాజిక అంశాలపై సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాత్మక రీల్స్ రూపొందిస్తూ యువతలో చైతన్యం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. సమాజం పట్ల బాధ్యతను మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

వేడుకల కంటే సేవే మిన్న..

అనే సందేశాన్ని తన ఆచరణతో చాటుతున్న విజయ కుమార స్వామిని పలువురు అభినందిస్తున్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే సేవాభావం, సమాజం పట్ల బాధ్యతను అలవాటు చేసే ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శనీయమని ప్రశంసిస్తున్నారు.





అర్హులైన పేదలకు చేయూత పింఛన్లతో ఆర్థిక భరోసా

హాలియా మున్సిపాలిటీలో నూతన పింఛన్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

ప్రజావాయిస్, అనుముల:

హాలియా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన చేయూత పింఛన్లకు ఎంపికైన లబ్ధిదారులకు హాలియా మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో ప్రొసీడింగ్ పత్రాలను మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు చేయూత పింఛన్ల ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఈ పింఛన్లు ఎంతగానో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల ప్రత్యేక అధికారి సుసింధర్ రావు, హాలియా మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి మధు, మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గౌనీ రాజారమేష్ యాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్ల సలహాదారులు, ఎంపీడీవో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు, ప్రముఖులు, అనుముల మండల సర్పంచులు, అధికారులు, సిబ్బంది, నూతన పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ నిల్వలపై దాడులు తప్పవు

బియ్యం ధరలను అదుపులో పెట్టాలి
రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి
రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు
హనుమకొండలో సీపీఐ ధర్నా

ప్రజా వాయిస్ హనుమకొండ జిల్లా ప్రతినిధి

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, తక్షణమే బియ్యం ధరలను ప్రభుత్వం అదుపులో పెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. బియ్యం ధరలను అదుపు చేయకుంటే అక్రమ నిల్వలపై సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. ధరల నియంత్రణ, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం తదితర డిమాండ్లతో సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ లో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య



అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కృత్రిమ కొరత సృష్టిస్తూ వ్యాపారులు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెరిగిన బియ్యం ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని, అక్రమంగా నిల్వ చేసిన గోదాములపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు అన్ని రకాల నిత్యావసర సరుకులను పప్పులు, నూనె, చక్కెర మొదలైనవి, సబ్సిడీపై పంపిణీ చేయాలని, ప్రజల ఆకలి కేకలను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మండల కార్యదర్శి ఎన్. అశోక్ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు అలకుంట్ల యాకయ్య, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, పొక్కుల సదానందం, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, నోముల కిశోర్, మాలోత్ మంగ, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, అలకుంట్ల మల్లయ్య, కనకం కావ్యశ్రీ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మానకొండూరులో ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి..

- రైతుల ఇబ్బందులు తొలగించాలి..
-తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి

ప్రజా వాయిస్, మానకొండూరు(నవంబర్ 18)::

మండలంలోని అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మానకొండూరు తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో వరి కోతలు ప్రారంభమై సగానికి పైగా పంట కోతలు పూర్తయినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ఆశించిన స్థాయిలో ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అకాల వర్షాల ముప్పు పొంచి ఉండటంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోళ్లలో జాప్యం కారణంగా ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీంతో రైతులు కనీస మద్దతు ధర కోల్పోయి నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి అన్ని కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని, రైతుల నుంచి ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రావుల శంకరచారి, మియపురం లక్ష్మణచారి, సిరిసిల్ల చంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్ యాదవ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అడప రవి, మండల సీనియర్ నాయకులు సోన్నకుల శ్రీనివాస్, మాచర్ల కోటేశ్వర్, జిల్లెల్ల రాజమౌళి, మండల ఉపాధ్యక్షులు మీసా రమణయ్య, గాడిచార్ల భూమయ్య, యువ మోర్చా అధ్యక్షులు కొండ్ర వరప్రసాద్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండ్ర సురేష్, మీసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పి హెచ్ సి లో అపరిశుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం..

- పరిశుభ్రతతోనే సగం రోగాలు దూరం
- వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజా వాయిస్, శంకరపట్నం(నవంబర్ 18):

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రతతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శంకరపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో అపరిశుభ్రతను గమనించిన ఆయన బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోనే పరిశుభ్రత పాటించకపోతే ఎలా అని ప్రశ్నించారు. శుచి, శుభ్రత పాటించడం ద్వారా సగం రోగాలను దూరం చేసుకోవచ్చని, ఆసుపత్రి లోపలే కాకుండా పరిసరాల పరిశుభ్రతపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం



ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు వివరాలు, విధులకు హాజరయ్యే సమయాలు, రోజువారీ విధులు, ప్రతిరోజూ ఎంతమంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు, ఏయే ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి



తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను కూడా ఎమ్మెల్యే పలకరించి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల సంఖ్య 6.70 లక్షలు.. గతంతో పోలిస్తే భారీగా పెరుగుదల

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలుకానుంది. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. మొత్తం 12 జిల్లాలు, 34 నియోజకవర్గాల పరిధిలో 6,70,407 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. 2021లో నమోదైన ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ప్రస్తుతం 1,64,842 మంది పెరిగారు. తాజా జాబితాలో 4,25,155 మంది పురుషులు, 2,24,310 మంది మహిళలు, 20,942 మంది ఇతరులు ఉన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓటర్ల వివరాలు ఇలా..

హనుమకొండ - 68,057
వరంగల్ - 66,956
మహబూబాబాద్ - 53,718
జనగామ - 35,418
భూపాలపల్లి - 15,337
ములుగు - 9,524

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,49,010 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.పట్టభద్రుల ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంతో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు ఈ ఓటర్లు కీలకంగా మారనున్నారు. ముఖ్యంగా యువత, ఉద్యోగులు, నిరుద్యోగ పట్టభద్రుల ఓటింగ్ సరళిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలేవి..?

- విద్యాధికారుల నిర్లక్ష్యంపై ఉద్యమిస్తాం
- అనుమతులు లేని విద్యాసంస్థల జాబితా విడుదల చేయాలి
- యు.ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి

ప్రజా వాయిస్, కరీంనగర్(నవంబర్ 18):

అనుమతులు లేకుండా కొనసాగుతున్న పాఠశాలలు, కళాశాలలపై విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని యు. ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి ప్రశ్నించారు. కరీంనగర్ పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు హిమంత్ అధ్యక్షతన జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాదం తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా అనుమతి లేని విద్యాసంస్థలను గుర్తించి వాటి జాబితాను ప్రకటించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు,తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు మౌనం వహించడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు.విద్యాసంస్థల యాజమాన్యాలకు అధికారులు కొమ్ముకాస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు, కళాశాలలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయో తక్షణమే బహిర్గతం చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న యాజమాన్యాలకు అధికారులు అండగా నిలిస్తే సహించేది లేదని, ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే కార్యాలయాల ఎదుట ఆందోళనలు,ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సంధ గణేష్, అరుణ్, మణితేజ, రామ్ చరణ్, లక్ష్మణ్ రాజు, శ్రీరామ్, మధు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. క్రమశిక్షణ ఉల్లంఘనపై పోలీస్ శాఖ కొరడా!

5 పోలీస్ సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్..

మరో 9 మందిపై శాఖాపరమైన చర్యలు

బెల్లంపల్లి / ప్రజా వాయిస్



విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, పోలీస్ శాఖ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన సిబ్బందిపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కఠిన చర్యలు తీసుకున్నారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది విధి సమయంలోనే పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ డ్యాన్స్ చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు.ఈ ఘటనకు సంబంధించి 5 పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 9 మంది సిబ్బందిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ అత్యంత ముఖ్యమైనవని స్పష్టం చేశారు. ప్రజల రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన పోలీస్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం ఎంతమాత్రం సహించరానిదని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ గౌరవ ప్రతిష్టలను కాపాడేలా వృత్తిపరమైన నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినా, పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించినా సంబంధిత సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

పరకాల నియోజకవర్గంలో 40.95 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

నూావీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన.. చేయూత పింఛన్ల పంపిణీ, ఇందిరా మహిళా డెయిరీ పాల సేకరణ కేంద్రం శంకుస్థాపన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీ కడియ కావ్య, మాజీ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి,జిల్లా కలెక్టర్ . సత్య శారద





ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల

పరకాల నియోజకవర్గంలో రూ.40.95 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ (సీతక్క) శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియ కావ్య, మాజీ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూావీ పథకం కింద చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, చేయూత పింఛన్ల పంపిణీ, పరకాలలో ఇందిరా మహిళా డెయిరీ పాల సేకరణ కేంద్రం, కేంద్ర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులా?

వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ 'వీకెండ్ ఎమ్మెల్యే'గా మారి మీడియాలో హైలైట్ అయ్యేందుకే ప్రెస్ మీట్లు పెడుతున్నారని విమర్శ ఆవేశంతో కాకుండా ఆలోచనతో ప్రజలకు పనిచేయాలని హితవు



ప్రజా వాయిస్, మెట్ పల్లి:

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా కోరుట్ల నియోజకవర్గంలో అన్యాయం, అవినీతి జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆరోపించారు. ఎమ్మెల్యే సంజయ్ అవినీతిని ప్రశ్నిస్తుంటే కిరాయి గుండాలతో దాడులు చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మెట్ పల్లి పట్టణంలోని జువ్వాడి భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్‌పై నర్సింగరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. "రాజకీయ అనుభవం లేని సంజయ్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. జాక్ పాట్, ఫోన్ ట్యాపింగ్ ద్వారా గెలిచిన మీరు, పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం చిత్తుగా ఓడిపోయారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండకుండా 'వీకెండ్ ఎమ్మెల్యే'గా మారారు. కేవలం మీడియాలో హైలైట్ కావడం కోసం ప్రెస్ మీట్లు పెట్టడం తప్ప నియోజకవర్గానికి చేస్తున్నది ఏమీ లేదు" అని విమర్శించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలు గజదొంగల్లా దోపిడీకి పాల్పడుతున్నారని నర్సింగరావు ఆరోపించారు. మెట్ పల్లి క్లబ్‌ను అమ్ముకున్న ఘనత ఎమ్మెల్యే సంజయ్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. స్వయంగా అవినీతికి పాల్పడుతూ, కరప్షన్ గురించి మాట్లాడే నైతిక అర్హత సంజయ్‌కు లేదని అన్నారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని సస్పెండ్ అయిన ఎమ్మెల్యే మీ నాన్న కాదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఇటీవల ఓ మీడియా ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. అసలు 'పరాన్నజీవి' అంటే ఎమ్మెల్యేకు అర్థం తెలుసా అని నర్సింగరావు నిలదీశారు. రాష్ట్రంలోని 70 శాతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పరాన్నజీవులేనని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్ ఆవేశంతో కాకుండా, ఆలోచనతో ప్రజలకు పనిచేయాలని ఆయన హితవు పలికారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,698 మందికి చేయూత

ఆసరా పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ..



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

అర్హతే ప్రామాణికంగా, కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలనలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కొత్తగా అర్హత పొందిన 2,698 మంది లబ్ధిదారులకు చేయూత ఆసరా పెన్షన్ల మంజూరు పత్రాలను ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కూడా చైర్మన్ గుండు సుధారాణి,ఏనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఐఏఎస్, +జెపీజ కమిషనర్ వెంకన్న నాయక్, డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రజాప్రతినిధుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అధికార యంత్రాంగమే నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు మంజూరు చేసే విధానానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.కానీ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డివిజన్‌కు కేవలం పది పెన్షన్లు చొప్పున ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పరిమిత సంఖ్యలో పెన్షన్లు ఇచ్చి ప్రజల అవసరాలను పట్టించుకోలేదని, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల విషయంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఒకే రోజు 2,698 మందికి పెన్షన్ల మంజూరు పత్రాలు అందించడం ప్రజాపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, గత ప్రభుత్వం చేసిన అప్పుల భారాన్ని భరిస్తూనే సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలు, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడ్డాయని ఎమ్మెల్యే వివరించారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, ఇతర సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అర్హులైన మిగతా లబ్ధిదారులకు కూడా దశలవారీగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఒకేసారి మంజూరు చేయడం సాధ్యం కాదని, అర్హత ఆధారంగా విడతలవారీగా అందిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలం ఉన్న అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధానాన్ని కూడా వివరించారు. పేదల గృహ అవసరాలను తీర్చేందుకు కొత్తగా టవర్స్ నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టామని తెలిపారు.పెన్షన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ లేదా ఇతర పార్టీలకు చెందిన వారనే తేడా లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.లబ్ధిదారుల నుంచి పెన్షన్లు లేదా ఇతర సంక్షేమ పథకాల మంజూరు కోసం ఎవరైనా ఒక్క రూపాయి డిమాండ్ చేసినా సహించేది లేదని హెచ్చరించారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులైన ప్రజలకు చేరాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన క్యాంపు కార్యాలయానికి లేదా స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలు ఎన్నికల సమయంలో డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా తమ జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొచ్చే నాయకులను గుర్తించి ఆదరించాలని కోరారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం తమ ఓటు హక్కును వినియోగించుకోవద్దని, తమతో పాటు తమ పిల్లల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.ఇప్పటికే పెన్షన్లు మంజూరైన వారితో పాటు ఇంకా అర్హత ఉండి పెన్షన్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్యాంపు కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం లేదా మున్సిపల్ అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజులు ఆలస్యమైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి శ్రీకారం!

- 18-59 ఏళ్ల అర్హులకు రూ.5 లక్షల బీమా భరోసా..
- ఈ నెల 19 నుంచి అమలు
- నెల రోజుల్లో లబ్ధిదారుల నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:
రాష్ట్రంలోని 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులకు రూ.5 లక్షల జీవిత బీమా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు.మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి పథకం అమలు ప్రక్రియ ప్రారంభించి, నెల రోజుల్లోగా అర్హుల వివరాల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు.

అవగాహన శిబిరాలు నిర్వహించాలి



పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. త్వరలో మొబైల్ యాప్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ రేషన్ కార్డు ఆధారంగా కుటుంబాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, కుటుంబ యజమాని తన భార్యను నామినీగా పేర్కొనాలని తెలిపారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ లేనట్లయితే జూలై 1వ తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ఆధార్, ఫోన్ నంబర్ వివరాలను పరిశీలించి దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రేషన్ కార్డులు లేని అర్హులకూ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సమన్వయంతో గడువులోగా పూర్తి చేయాలి
అదనపు కలెక్టర్ వెంకటాచారి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు ఆన్‌లైన్ నమోదు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పథకాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, డీఆర్డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, సీపీఓ వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం మహమూద్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెంచిన మున్సిపల్ పన్నులకు నిరసనగా నవంబర్ 20న ములుగు పట్టణ బంద్

ప్రజలపై అడ్డగోలు పన్నుల భారం తగ్గించాలి
సిరికొండ బలరాం.బిజెపి జిల్లా అధ్యక్షుడు

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/
ములుగు మున్సిపాలిటీలో అడ్డగోలుగా పెంచిన ఇంటి పన్నులు, వ్యాపార పన్నులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ శుక్రవారం ములుగు పట్టణ బంద్‌కు భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చింది.ములుగులోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతమైన ములుగులో ప్రజల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా



పన్నులు పెంచడం అన్యాయమని విమర్శించారు. 48 గంటల నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన పట్టణ ప్రజలు, వ్యాపారులు, ప్రజా సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పెంచిన పన్నులను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవంబర్ 20న జరిగే బంద్‌కు వ్యాపారులు, విద్యాసంస్థలు, ప్రజలు, అఖిలపక్ష నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. బంద్‌లో రాష్ట్ర నాయకులు సైతం పాల్గొంటారని వెల్లడించారు.ఈ సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్య జవహర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపు రమేష్, శీలమంతుల రవీంద్రచారి, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లే శోభన్, మండల అధ్యక్షుడు రాయించు నాగరాజు, నాయకులు గాదం కుమారస్వామి, పెరబోయిన హేమాద్రి, అజ్మీర కిషోర్ నాయక్, కొండబోయిన కిరణ్, బండి రవీందర్ తదితరులు పాల్గొన్నార

ఘట్‌కేసర్ సర్కిల్‌లో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటన

డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు..
నిరుపయోగ కేబుళ్లు తొలగించాలని సూచన,
ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు,
పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు.

ప్రజావాయిస్, ఘట్‌కేసర్ సర్కిల్ :
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ బుధవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. అన్ని విభాగాల అధిపతులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ అభివృద్ధి పనులు, డ్రైనేజీ సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా లింగాలకుంట వద్ద ఉన్న డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను కమిషనర్ పరిశీలించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తక్షణమే సంబంధిత ఫైల్ సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



అదేవిధంగా ఘట్‌కేసర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.సన్‌సైన్ పార్క్ సమీపంలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ)ను తనిఖీ చేసిన కమిషనర్, అక్కడ చెత్త పేరుకుపోకుండా నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.బోగారం, కరీంగూడ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యలను కూడా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు త్వరితగతిన రూపొందించి సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం రాంపల్లి చౌరస్తా వద్ద చేపడుతున్న రోడ్డు లేన్ మార్కింగ్ పనులను, ఇస్మాయిల్ ఖాన్‌గూడ వద్ద బెల్‌మౌత్ ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ముఖ్యంగా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో రోడ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న, నిరుపయోగంగా ఉన్న కేబుళ్లను తక్షణమే తొలగించాలని కేబుల్ ఆపరేటర్లకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల భద్రతకు ఇబ్బందులు కలిగించే విధంగా కేబుళ్లు ఉండకూడదని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాని రెడ్డి,సర్కిల్ కార్యాలయంలో ని వివిధ విభాగాల అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు...

నిరుపేదలకు చేయూత పింఛన్లతో ఆర్థిక భరోసా..!

-అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బాలునాయక్
-గుడిపల్లి మండలంలో 223 మందికి, పీఏ పల్లి మండలంలో 433 మందికి కొత్త పింఛన్లు మంజూరు
-లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన దేవరకొండ ఎమ్మెల్యేలి
-రూ.15 కోట్లతో గుడిపల్లి, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము మండలాల్లో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల నిర్మాణం
-కొండమల్లేపల్లిలో వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు

ప్రజా వాయిస్.పీఏపల్లి
నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే శ్నేనావత్ బాలునాయక్ అన్నారు.గుడిపల్లి మండలంలో 223 మంది, పీఏ పల్లి మండలంలో 433 మంది



లబ్ధిదారులకు మంజూరైన కొత్త చేయూత పింఛన్ల పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా అందించే పింఛన్ సొమ్ము పేదలకు నిత్యావసరాలు, వైద్య ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆత్మగౌరవంతో జీవించేందుకు అండగా నిలుస్తుందని తెలిపారు.

మహిళా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత
మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ వంటి పథకాలతో ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివరించారు

దేవరకొండకు ఆర్డీఓ కార్యాలయం తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే
గతంలో ఆర్డీఓ కార్యాలయం మిర్యాలగూడలో ఉండేదని, తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దేవరకొండకు ఆర్డీఓ కార్యాలయాన్ని తీసుకొచ్చానని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో గుడిపల్లి, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము మండలాల్లో సుమారు రూ.15 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయ సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

కొండమల్లేపల్లిలోనే వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయం
గతంలో కొత్త వాహనం కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్ కోసం మిర్యాలగూడకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు కొండమల్లేపల్లి మండల కేంద్రంలోనే వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. దీంతో ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతాయని పేర్కొన్నారు.దేవరకొండ నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో అధికారులు, మండల అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి, మావిల్ల లక్ష్మి నారాయణ, ఏవి రెడ్డి, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, వంగాల ప్రతాపరెడ్డి, వీరబోయిన ఎల్లయ్య యాదవ్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మద్దిమడుగు రామస్వామి, తేరా సత్యం రెడ్డి, మండలాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్ సీఐగా చంద్రశేఖర్ రెడ్డి

ప్రజావాయిస్/తాండూరు
తాండూరు రూరల్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన సీఐగా చంద్రశేఖర్ రెడ్డి ఇవాళ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన సీఐ చంద్రశేఖర్ రెడ్డికి పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. తాండూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తామని నూతన సీఐ తెలిపారు.





ప్రజాస్వామ్యమా.. పోలీసు రాజ్యమా?

తాండూర్‌లో జావీద్ అరెస్టుపై బీఆర్ఎస్ ఆగ్రహం

ప్రజావాయిస్/తాండూర్
తాండూర్ పట్టణం లోని 8వ వార్డు రాజీవ్ కాలనీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ శంకుస్థాపనకు ముందు బీఆర్ఎస్ కౌన్సిలర్ జావీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జావీద్‌ను అరెస్ట్ చేయకుండా కాలనీవాసులు అడ్డుకున్నప్పటికీ పోలీసులు బలవంతంగా గౌతాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని వారు ఆరోపించారు.ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులతో అణచివేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పర్యటన సందర్భంగా ప్రజాప్రతినిధిగా ఉన్న కౌన్సిలర్‌ను ముందస్తుగా అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించాలని సూచించారు.తాండూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు, నిరసనలు చేస్తే అరెస్టులు చేస్తున్నారని రాజుగౌడ్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేందర్ రెడ్డి, నరుకుల నరేందర్ గౌడ్, సలీమ్, శ్రీనివాస్ చారి, వెంకట్ రెడ్డి, ఇంతియాజ్ బాబా, వేణు గౌడ్, దత్తాత్రేయ రావు, కొర్రా సందీప్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



22 నాటి మీటింగ్ కు జర్నలిస్ట్ ఫెడరేషన్ తో సంబంధం లేదు

అర్హత గల వారికి అక్రిడేషన్ కార్డులు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
స్పష్టం చేసిన టి డబ్ల్యూ జేఎఫ్ కామారెడ్డి జిల్లా నేతలు

ప్రజా వాయిస్ కామారెడ్డి /
ఈనెల 22న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లో నిర్వహించే సమావేశానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టిడబ్ల్యూజెఎఫ్ కు ఎలాంటి సంబంధం లేదని కామారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నేతలు స్పష్టం చేశారు.ఈనెల 22న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సమావేశానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కు ఎలాంటి సంబంధం లేదని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నుండి వేరుపడిన కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా తలపెట్టిన ఈ సమావేశంకు టి డబ్ల్యూజెఎఫ్ కు ఎలాంటి సంబంధం లేదని అది వాళ్ళ వ్యక్తిగతమని తెలిపారు. అర్హత గల జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని ఇళ్ల స్థలాలు కేటాయించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు.టిడబ్ల్యూజెఎఫ్ పేరుతో ఎలాంటి సమావేశము నిర్వహించడం లేదని తెలిపారు. ఈ విషయాన్ని వ్యాపార వేత్తలు, అధికారులు ,రాజకీయ నాయకులు గమనించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, కార్యదర్శి కరుణాకర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విజయానంద్ భూపాల్, న్యాయ సలహాదారు కృష్ణమూర్తి, దశరథ్, సంజీవ్ , లక్ష్మణ్, రాజు,నగేష్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు



తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు

వనపర్తి జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్ ఆధ్వర్యంలో

టీఆర్పీలో చేరిన పలువురు నాయకులు

తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి

వనపర్తి టిఆర్పి జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్

ప్రజా వాయిస్.. వనపర్తి

తెలంగాణ రాజ్యాధికార పార్టీలో నూతన చేరికలు కొనసాగుతున్నాయి. వనపర్తి జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాకు చెందిన పలువురు నాయకులు బుధవారం హైదరాబాద్ పార్టీ కేంద్ర కార్యాలయంలో టీఆర్పీలో చేరారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో గోపాల్‌పేట మండలానికి చెందిన మాజీ సర్పంచ్ సోదరుడు నర్సింలు, కదుకుంట్ల గ్రామానికి చెందిన బీసప్ప,నిర్మల ముదిరాజ్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా నాయకులు మహేందర్, భీమేష్, బాలదాసు, గోపాల్‌పేట నాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థినికి అండగా అర్ధ సుధాకర్ రెడ్డి

రూ.30 వేల సొంత ఖర్చుతో బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజావాయిస్/వికారాబాద్:

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు సుభాష్ నగర్ కాలనీకి చెందిన బీటెక్ విద్యార్థినికి చదువుకునేందుకు ల్యాప్‌టాప్ అవసరమని తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. తన సొంత ఖర్చులతో రూ.30 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసి విద్యార్థినికి అందజేశారు. పేద విద్యార్థులు చదువులో వెనుకబడకూడదని, వారికి తనవంతు సహాయం ఎల్లప్పుడూ అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. ల్యాప్‌టాప్ అందుకున్న విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

శంషాబాద్ అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

ప్రజావాయిస్॥శంషాబాద్:



పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం భక్తుల శరణుఘోషతో మార్మోగింది. డాక్టర్ రామరాజు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమానికి రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పి. కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ..అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని,ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు.వేద మంత్రోచ్చారణలు, భజనలు,అయ్యప్ప నామస్మరణ మధ్య పూజా కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా సాగాయి.పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

కొత్తకోట సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: ఎస్పీ సునిత రెడ్డి

పెబ్బేర్ నవంబర్ 18 ప్రజా వాయిస్

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తకోట సర్కిల్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ల పనితీరు, శాంతిభద్రతలు, పెండింగ్ కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, హైవే పరిసర గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు జరగకుండా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ముఖ్యంగా పోక్సో కేసుల దర్యాప్తును 60 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, జీరో ఎఫ్ఐఆర్ నమోదులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరస్తులను గుర్తించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.గంజాయి విక్రయాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రజలు డయల్-112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ ఓడి రమేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



తండ్రి ఆశయాలకు తనయుడి నివాళి..

- విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ!

-మూడవ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం చేపట్టిన బుచ్చిరెడ్డి

ప్రజావాయిస్/మోమిన్ పేట్:

తండ్రి జ్ఞాపకాలను పదిలం చేసుకుంటూ.. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తనయుడు చేపట్టిన సేవా కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని అమ్రాది కుర్దు ప్రాథమికోన్నత పాఠశాలలో దివంగత నాయకుడు మహిపాల్ రెడ్డి మూడవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు బుధరపు బుచ్చిరెడ్డి విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు.తండ్రి వర్ధంతిని కేవలం స్మరణ కార్యక్రమానికే పరిమితం చేయకుండా, విద్యార్థుల అవసరాన్ని గుర్తించి క్రీడా దుస్తులు అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కొనియాడారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, తండ్రి జ్ఞాపకార్థం బుచ్చిరెడ్డి చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్లోళ్ల పురుషోత్తం రెడ్డి, ఉపసర్పంచ్ ప్రకాష్, వార్డు సభ్యులు షకీల్, బాలరాజు, మాజీ సర్పంచ్ మైబల్లి, అంజయ్య, మల్లేశం, శేఖర్ గౌడ్, పుండరీకం, ప్రేమానందం, జగన్మోహన్ రెడ్డి, రవి, స్వామి, శేఖర్, శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ ఘనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై షాబాద్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం

(ప్రజా వాయిస్ షాబాద్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించి షాబాద్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించనున్న ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో క్యాంప్ ఇన్‌ఛార్జ్‌లు, క్యాంప్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు.మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఏ.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో శిబిరాల ఏర్పాటు, దరఖాస్తుల స్వీకరణ, కుటుంబ పోషకుడైన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల సభ్యుడి ఆధార్, రేషన్ కార్డు ఆధారంగా వయస్సు ధృవీకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు తదితర అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.ఇదిలా ఉండగా, జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీన నియోజకవర్గ స్థాయిలో మొదటి విడత కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. షాబాద్ మండలంలో గ్రామపంచాయతీలను రెండు విడతలుగా గుర్తించి కార్యక్రమాలు చేపట్టనుండగా, తొలి విడత గ్రామపంచాయతీల్లో నవంబర్ 20న శిబిరాలు నిర్వహించనున్నారు. గ్రామపంచాయతీల ఎంపిక వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు ఎంపీడీఓ అపర్ణ తెలిపారు.ఈ కార్యక్రమం లో ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు



రాజేంద్రనగర్‌లో 4,392 మందికి పెన్షన్ కానుక

చేయూతతో కొత్త లబ్ధిదారులకు ఆర్థిక భరోసా

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత

లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

ప్రజావాయిస్॥రాజేంద్రనగర్:

చేయూత పెన్షన్లతో మరో 4,392 నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని రాజేంద్రనగర్, గండిపేట్,శంషాబాద్ ప్రాంతాలకు చెందిన నూతన లబ్ధిదారులకు పెన్షన్ ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు.జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నిరాధారులకు పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని,పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో వేలాది మందికి పెన్షన్లు అందుతుండగా,తాజాగా మరో 4,392 మందికి మంజూరు కావడం సంతోషకరమన్నారు.అధికారుల వివరాల ప్రకారం..అత్తాపూర్ సర్కిల్‌లో 1,901, రాజేంద్రనగర్‌లో 771, నార్సింగిలో 281, మణికొండలో 263, శంషాబాద్ మండలంలో 652,శంషాబాద్ పట్టణంలో 524 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయి.కార్యక్రమంలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లోకపెద్ద మల్లారెడ్డి, తహసీల్దార్ బొమ్మ రాములు,డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు స్వాతి, యుగంధర్ రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు,లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎట్ల ఎర్రవల్లి గ్రామంలో విషాదం 20 ఏళ్ల యువకుడు ఆత్మహత్య

(ప్రజా వాయిస్ షాబాద్)



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం ఎట్ల ఎర్రవల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పుంటికూర ఉదయ్ తేజ (20) బుధవారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలంలో మృతిచెందాడు.వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన లేట్ సత్తయ్య కుమారుడు ఉదయ్ తేజ బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ చింత చెట్టుకు డ్రిప్ వాటర్ పైపుతో ఉరివేసుకొని మృతిచెందినట్లు సమాచారం.ఈ ఘటనపై మృతుడి అన్న అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

నిర్మల్‌లో కలకలం..

నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి దూకిన మహిళ!

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ షాపింగ్ మాల్ పక్కన నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనం పై నుంచి ఓ మహిళ దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.సారంగాపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సంగీత కుటుంబ కలహాల కారణంగా ఈ అఘాయిత్యానికి ప్రయత్నించినట్లు ప్రాథమిక సమాచారం.భవనం పైభాగంలో ఉన్న ఆమెను కిందకు రావాలని పలువురు ఎంతగా బతిమాలినా వినకుండా చివరకు పై నుంచి దూకేసింది. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు అంబులెన్స్‌లో ఆమెను నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.సంగీతకు భర్త రవితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. కుటుంబ కలహాలే ఆత్మహత్యాయత్నానికి కారణమని ఆమె బంధువు కన్నీటిపర్యంతమవుతూ తెలిపినట్లు సమాచారం.ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కళలకు జీవం పోస్తూ కళాకారులకు కొండంత అండ

జాంబవంతుని కథ నాటక ప్రదర్శనకు రూ.50 వేల విరాళం

ప్రసూన్ కన్స్ట్రక్షన్ అధినేత యెన్నం గోపాల్ రెడ్డి ఆర్థిక చేయూత

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో కనుమరుగవుతున్న ప్రాచీన జానపద, పౌరాణిక కళారూపాలకు ప్రోత్సాహం అందిస్తూ ప్రసూన్ కన్స్ట్రక్షన్ అధినేత, ప్రముఖ కాంట్రాక్టర్ యెన్నం గోపాల్ రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కేశంపేట మండలం సంగెం గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింధోళ్ల సంప్రదాయ జాంబవంతుని కథ నాటక ప్రదర్శనకు రూ. 50 వేల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యెన్నం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా వస్తున్న జానపద పౌరాణిక కళారూపాలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు ఆధునిక వినోద సాధనాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన కళల గొప్పతనం ఎప్పటికీ చెరిగిపోదని పేర్కొన్నారు. చాలా కాలం తర్వాత సంగెం గ్రామస్తులంతా ఐక్యంగా ముందుకొచ్చి ప్రాచీన రంగస్థల కళకు మళ్లీ ప్రాణం పోయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కళారూపాలను కాపాడుకోవడంతో పాటు భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కళాకారులను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చి రూ. 50 వేల విరాళం అందించిన యెన్నం గోపాల్ రెడ్డికి గ్రామస్తులు నాటక నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అందించిన ఆర్థిక



సహాయం నాటక ప్రదర్శనకు ఎంతో తోడ్పాటుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, సంగెం గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాల్ చారి, ఉప సర్పంచ్ షకీల్, మాజీ ఎంపీటీసీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



శివరాం నగర్‌లో అయ్యప్ప స్వామి పడిపూజ

ప్రత్యేక పూజలు, భజనలు.. అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన కాలనీ

ప్రజా వాయిస్/వికారాబాద్

వికారాబాద్ పట్టణంలోని శివరాం నగర్ కాలనీలో గురుస్వామి మంగ రామకృష్ణ నివాసం వద్ద బుధవారం శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజా వేదికను పుష్పాలు, దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. పడిపూజలో భాగంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ, దీపారాధన నిర్వహించారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి, కర్పూర హారతి ఇచ్చారు. అయ్యప్ప స్వామి మహిమను కీర్తిస్తూ భక్తులు భజనలు, సంకీర్తనలు ఆలపించడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శరణుఘోషలతో శివరాం నగర్ కాలనీ మార్మోగింది. అయ్యప్ప దీక్షలో భాగంగా భక్తులు నియమ నిష్ఠలతో స్వామివారిని ఆరాధిస్తూ, భక్తి భావంతో పడిపూజలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి పద్దెనిమిది పవిత్ర మెట్లకు ప్రత్యేక ప్రాధాన్యతను వివరిస్తూ భక్తులు స్వామివారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, కాలనీవాసులు, పలువురు ప్రముఖులు, పాత్రికేయ మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సమక్షంలో పడిపూజ కార్యక్రమం ఆధ్యాత్మిక వైభవంగా ముగిసింది.

ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు

నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత

అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలో రూ.3.33 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్ చెరువు ప్రజావాయిస్

ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రధానంగా నూతనంగా ఏర్పడుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం అమీన్‌పూర్,



బీరంగూడ డివిజన్ల పరిధిలోని వడకపల్లి, పటేల్ గూడా, ఎన్ఎస్ఎల్ కాలనీ, మండే మార్కెట్, తులసి వనం కాలనీలలో రూ. 3.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని, పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీల సంక్షేమ సంఘాలు, స్థానిక ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని, ప్రతి డివిజన్‌లో స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు సి ఎస్ ఆర్ ద్వారా నూతన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ లలితా శ్రావణి, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, డిఈ వెంకటరమణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తులసి రెడ్డి, చంద్రశేఖర్, యునిస్, మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, జగదీష్, సునీత రాజేష్ గౌడ్, శ్రీకాంత్, దాసు, యాసఫ్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ జేఏసీ దీక్షకు ఎమ్మెల్యే మేడిపల్లి సంఘీభావం..

సర్కులర్ జారీకి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం..

ప్రజా వాయిస్, కరీంనగర్ (నవంబర్ 18):



శాతవాహన యూనివర్సిటీ ప్రధాన గేటు ఎదుట గత ఐదు రోజులుగా వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డితో పాటు సంబంధిత అధికారులతో చర్చించి, లాసెట్, పీజీ సెట్‌కు సంబంధించిన సర్కులర్‌ను బుధవారం సాయంత్రంలోగా శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు పంపించేలా చర్యలు తీసుకుంటామని జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే హామీతో విద్యార్థి సంఘాల నాయకులు తమ సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు లింగంపల్లి మహేష్, ఎన్‌టీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, యోగి, మణిచరణ్, రాణి, మమత, దివ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్ల పంపిణీ.. లబ్ధిదారుల హర్షం

మండలంలో కొత్తగా 646 మందికి పింఛన్లు మంజూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పంపిణీ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి టి. శేఖర్

ప్రజా వాయిస్: గుర్రంపోడు మండలం

నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలంలోని ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం గుర్రంపోడు మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి మరియు జిల్లా ఉద్యాన శాఖ అధికారి టి. శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు కొత్త పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ



ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే గుర్రంపోడు మండల వ్యాప్తంగా కొత్తగా 646 మంది అర్హులకు చేయూత పింఛన్లను మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు ఆర్థికంగా భరోసా పొందుతారని, ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) జె. మహేష్, మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) ఆంజనేయులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి, చలమల్ల జగదీశ్వర్ రెడ్డి, సూదిని జగదీశ్వర్ రెడ్డి గుర్రంపోడు సర్పంచ్ జాల యాదయ్య గుర్రంపోడు మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు గంగాల కృష్ణ పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మరియు లబ్ధిదారులు హాజరయ్యారు. తమకు కొత్తగా పింఛన్లు మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.



కీసరలో నూతన లైబ్రరీ ప్రారంభం...

రూ.1.55 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరం

ప్రజావాయిస్, కీసర :

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన లైబ్రరీ భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కీసర డివిజన్ అధ్యక్షులు రామిడి స్వప్న విజయ రెడ్డి తదితరులు బుధవారం ప్రారంభించారు. కీసరలోని శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి కాలనీలో సుమారు రూ. 1 కోటి 55 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ లైబ్రరీ భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఈ సందర్భంగా నాయకులు లైబ్రరీలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు



సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, దినపత్రికలు, వివిధ రకాల అధ్యయన సామగ్రిని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు గ్రంథాలయాలు ఎంతో కీలకమని, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు నిరంతర అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న లైబ్రరీ సదుపాయాన్ని యువత సద్వినియోగం చేసుకొని విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధిలో విద్య, విజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. కీసర మండల కేంద్రంలో అత్యాధునిక వసతులతో లైబ్రరీ అందుబాటులోకి రావడం పట్ల స్థానిక విద్యార్థులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు...



తాండూరు అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

- రూ.1.40 కోట్లతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన..

- పెద్దేముల్‌లో 908 మందికి పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

ప్రజా వాయిస్/తాండూరు

తాండూరు నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని రాజీవ్ కాలనీలో రూ. 1.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సొంత భవనం లేక ప్రజలు, అధికారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు నూతన భవనంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆధునిక సౌకర్యాలతో మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం పెద్దేముల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో 908 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. పెన్షన్ పథకంలో అవినీతికి తావులేదని, పెన్షన్ ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు సహా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పెద్దేముల్ మండలంలోని రోడ్ల అభివృద్ధితో పాటు సుమారు రూ. 100 కోట్లతో కోట్‌పల్లి ప్రాజెక్టు పనులు చేపడుతున్నామని, వీటితో 14 గ్రామాల రైతులకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బలరెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రవూఫ్, కమిషనర్ రాకేష్, పెద్దేముల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లోంక నర్సిములు, ఎంపీడీవో తిరుమల స్వామి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు రగ్గుల పంపిణీ

చలికాలంలో చిన్నారులకు అండగా నిలిచిన అల్లం దంపతులు

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

పట్టణంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో ఉన్న 15 మంది దివ్యాంగ చిన్నారులకు గాంధీనగర్‌కు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు అల్లం భాగ్యలక్ష్మి–సత్యనారాయణ దంపతులు రగ్గులు పంపిణీ చేశారు. యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్ ఇచ్చిన పిలుపుకు స్పందించి చలికాలంలో చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వు చూడటం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా దంపతులు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మ రాజ్ కుమార్, దేశెట్టి రమేష్, ఏబీఎన్ కనకయ్య, కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



నిత్యవసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలి

రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి..

తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

రోజురోజుకు పెరుగుతున్న బియ్యం పప్పులు కూరగాయలు తదితర నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన వారి ధాన్యానికి తగిన ధర పెరగకపోగా మార్కెట్లో బియ్యం ధరలు మాత్రం రోజురోజుకు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రేషన్ షాపుల ద్వారా గోధుమలు నూనె చక్కెర ఉప్పు పప్పులు, సబ్బులు తదితర 12 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, గోపాల్పూర్ సర్పంచ్ కర్రె లక్ష్మి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మర్రి శ్రీనివాస్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మర్రి విజయ్, డిహెచ్ పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టేముక్కుల మనోహర్ రావు, సిపిఐ నాయకులు సూర మొగిలి, ఎం. మల్లయ్య, జూపాక రవీందర్, ఉట్కూరి బిక్షపతి, బోయినపల్లి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడి కుటుంబానికి రూ.కోటి బీమా చెక్కు అందజేత

బెల్లంపల్లి, / ప్రజా వాయిస్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడి కుటుంబానికి బెల్లంపల్లి యూనియన్ బ్యాంక్ అండగా నిలిచింది. బ్యాంకులో సాలరీ అకౌంట్ కలిగి ఉన్న కార్మికుడికి వర్తించే బీమా పథకం ద్వారా ఆయన కుటుంబ సభ్యులకు రూ.కోటి బీమా పరిహారాన్ని అందజేసింది.వివరాల్లోకి వెళితే.. బెల్లంపల్లి స్టేషన్ రోడ్ కాలనీకి చెందిన పులి మూర్తి కాసిపేట గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించేవారు. గత ఏడాది లక్సెట్టిపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. మూర్తికి బెల్లంపల్లి యూనియన్ బ్యాంకులో సాలరీ అకౌంట్ ఉండటంతో బ్యాంకు ద్వారా వర్తించే బీమా సదుపాయం కింద ఆయన కుటుంబానికి రూ.కోటి పరిహారం మంజూరైంది.ఈ నేపథ్యంలో బుధవారం బెల్లంపల్లి యూనియన్ బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు (హైదరాబాద్), డీజీఎం నటరాజన్ (కరీంనగర్), బెల్లంపల్లి బ్రాంచ్ మేనేజర్ చందన్ కుమార్ చేతుల మీదుగా మృతుడి నామినీలైన భార్య పులి జ్యోత్స్న, తల్లి అనసూర్యలకు రూ.కోటి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని బీమా సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు బీమా కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



హాలియా మున్సిపాలిటీలో నూతన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ..

ప్రజా వాయిస్ : హాలియా: నవంబర్ 18:

హాలియా మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన చేయూత పింఛన్లకు ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను లిహాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అందజేశారులి.ఈ సందర్భంగా చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలకు ప్రభుత్వం చేయూత పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి స్త్రీలు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఈ పింఛన్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అనుముల మండల స్పెషల్ ఆఫీసర్ సుసింధర్ రావు గారు, హాలీయ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ మధు గారు, మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గౌనీ రాజారమేష్ యాదవ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్ల సలహాదారులు , వీ.ణ.ా గారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుర ప్రముఖులు అనుముల మండల సర్పంచులు, అధికారులు, సిబ్బంది, నూతన పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు: మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి

బైంసాలో నూతన 'చేయూత' పెన్షన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

ముఖ్య అతిథిగా పాల్గొన్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

బైంసా మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన 'చేయూత' పెన్షన్ల ప్రొసీడింగ్స్ కాపీల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ హాజరయ్యారు.ఆయన మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రితో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి మాట్లాడుతూ,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. చేయూత పెన్షన్ల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని, వారి జీవనానికి ఇది ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. నూతనంగా పెన్షన్లు పొందిన లబ్ధిదారులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ,ఈ పథకం వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్, మున్సిపల్ కౌన్సిలర్ల బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహారెడ్డి

పటాన్ చెరువు ప్రజావాయిస్



నేడు సిద్దిపేటలో జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ముత్తంగి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షాపూర్ నరసింహారెడ్డి అన్నారు సిద్దిపేటలో నేడు జరగబోయే సభలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సిద్దిపేట గడ్డ నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుండి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాల్గొని నేడు జరగబోయే సభను విజయవంతం చేయాలని అన్నారు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన ప్రజలకు అందిస్తుందని అన్నారు తెలంగాణలోని అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని అన్నారు రాబోవు కాలంలో మరిన్ని వినూత్నమైనటువంటి ప్రభుత్వ పథకాలతో నిరుపేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ పాలన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు



పోతారంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం...

- రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పటేల్

ప్రజా వాయిస్ మంథని

మండలంలోని పోతారం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, గ్రామ సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పటేల్ పాల్గొని కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పటేల్ మాట్లాడుతూ గ్రామ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పుట్టపాకలో యాదవుల సదర్ సమ్మేళనం సందడి!

ముఖ్య అతిథులుగా పాల్గొన్న యాదవులు

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా, పుట్టపాక గ్రామంలోని గాంధీ పార్క్ వేదికగా సాయంత్రం యాదవ్స్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతుల వేషధారణ, యాదవ బంధుమిత్రుల సందడి వేడుకకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ హాజరయ్యారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, యాదవ సంఘం నాయకులు, కొత్త మహేష్ యాదవ్ మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని జయప్రదం చేశారు.

అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం

రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

చేయూత పింఛన్ పథకాల పంపిణి

పటాన్ చెరువు ప్రజావాయిస్



తెలంగాణ రాష్ట్రంలో ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు బుధవారం నాడు పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని గుమ్మడిదల మండల కేంద్రంలో నూతన లబ్ధిదారులకు చేయూత పింఛను పంపిణి చేశారు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతికజైన్ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు చేయూత పించిన్ పథకం ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతిఒక్క లబ్ధిదారునికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని అన్నారు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు రాబోవు రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఒక్క లబ్ధిదారునికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో నియోజక వర్గం నుంచి వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు ప్రజా ప్రతినిధులు మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు అధికారులు అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మోటకొండూరు పశు వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్‌ను నియమించాలి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి



మోటకొండూరు, నవంబర్ 18(ప్రజా వాయిస్)::-
మోటకొండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో పర్మినెంట్ డాక్టర్‌ను నియమించాలని కోరుతూ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆత్మ కమిటీ డైరెక్టర్ రేగు రమేష్ ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేగు రమేష్ మాట్లాడుతూ...
మోటకొండూరు మండల కేంద్రంలోని వెటర్నరీ ఆసుపత్రిలో పర్మినెంట్ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో పశువులు, లేగదూడలు రోగాల బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే పశు వైద్యశాలలో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



బెల్లంపల్లి నియోజకవర్గము 7 మండలాల్లో చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ ఎమ్మెల్యే గడ్డం వినోద్

వెంకటస్వామి చేతుల మీదుగా పంపిణీ

ప్రజా వాయిస్ బెల్లంపల్లి/ కాసిపేట.
మంచిర్యాల జిల్లా ఆర్య వైశ్య భవన్ బాబు క్యాంప్ బెల్లంపల్లి లో మరియు కాసిపేట మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు చెందిన 483 మంది లబ్ధిదారులకు వివిధ రకాల చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి చేతుల మీదుగా ఘనంగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వితంతు పెన్షన్లు, దివ్యాంగుల పెన్షన్లు, ఒంటరి మహిళల పెన్షన్లు, చేనేత కార్మికుల పెన్షన్లు, గీత కార్మికుల పెన్షన్లు తదితర వివిధ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ చంద్రయ్య డి ఆర్ డి ఓ కిషన్ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి,ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, సింగిల్ విండో చైర్మన్ ,శంకర్ గౌడ్ ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎం పి ఓ శేక్ సఫ్దర్ అలీ, లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయ సిబ్బంది పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



సామాజిక పరివర్తన

విద్యార్థులతోనే సాధ్యం

- మహనీయుల ఆశయాల సాధనకు మాదిగ విద్యార్థులు సిద్ధం కావాలి
- విద్యతోనే కుల వివక్ష, అసమానతలకు చరమగీతం
- ఎస్సీ వర్గీకరణతో లభించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను చైతన్యపరచాలి
- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ మండల కమిటీల ఎన్నిక
- ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
కులపరమైన అవమానాలు, అంటరానితనం, అణచివేత, అసమానతలు, వివక్షత వంటి సామాజిక రుగ్మతలు తొలగిపోయి నూతన సమాజ నిర్మాణం జరగాలంటే యువత, విద్యార్థులతోనే సామాజిక పరివర్తన సాధ్యమని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ అన్నారు. మహనీయుల ఆశయాలను నెరవేర్చేందుకు మాదిగ విద్యార్థులు విద్యా రంగంలో రాణించడంతోపాటు సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన గజ్వేల్ మండల కమిటీ ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుడిగే మహేశ్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ.. కుల వివక్షత రూపాలు మార్చుకుంటూ దళితులు, అణగారిన వర్గాల ప్రజలను ఇప్పటికీ తీవ్రంగా వేధిస్తోందన్నారు. కులరహిత భారత నిర్మాణాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆకాంక్షించారని, ఆ ఆశయ సాధన దిశగా మంద కృష్ణ మాదిగ సామాజిక ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో దళితులు, పీడిత వర్గాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. మాదిగ కులంలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను చైతన్యపరచాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా అందుబాటులోకి వచ్చిన 9 శాతం రిజర్వేషన్ల అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. బుద్ధుడి నుంచి నేటి మంద కృష్ణ మాదిగ వరకు మహనీయులు సాగించిన పోరాట స్ఫూర్తితో యువత, విద్యార్థులు ముందుకు సాగాలని అన్నారు. ఇందుకోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ సంఘాల్లో చేరి సామాజిక ఉద్యమానికి బలాన్ని చేకూర్చాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ గజ్వేల్ మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సింగాటానికి చెందిన బొంది స్వామి మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా పంది శ్రీకాంత్, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా జోగు జైసన్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల ఇన్‌చార్జిలు ఉబ్బని ఆంజనేయులు మాదిగ, శనిగారి రమేష్ మాదిగ సమన్వయం చేశారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ ప్రకాష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ, ఎంఎస్పీ పట్టణ అధ్యక్షుడు ఈధోళ్ల యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు చింతకింది యాదగిరి మాదిగ, వివిధ గ్రామాల యువకులు, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.



దుబ్బాకను రెవిన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలి

దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు శ్రీకాంత్

ప్రజా వాయిస్ /దుబ్బాక :
సిద్దిపేట జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం అయిన దుబ్బాకకు రెవెన్యూ డివిజన్ మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డిని దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ కోరారు. విద్య, వైద్యం, రహదారులు వంటి రంగాలలో నియోజకవర్గం చాలా వెనబడిందని, సరైన అభివృద్ధి లేకపోవుట వలన నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. సరైన సదుపాయాలు లేక యువత నిరుద్యోగులుగా ఉంటున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచడానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు, చిన్న, పెద్ద పరిశ్రమలు దుబ్బాక నియోజకవర్గంలో ఏర్పాటు అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డి డి ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్గల రాజేశ్, జాయింట్ సెక్రెటరీ చారి, సభ్యులు శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 240 కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు..

దుబ్బాక నియోజకవర్గానికి రెండు నూతన సహకార సంఘాలు

అక్బర్‌పేట-భూంపల్లి, రాయపోల్ మండలాల్లో పీఏసీఎస్‌ల.

ఏర్పాటుకు కృషి చేసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు

పాతూరి వెంకటస్వామి గౌడ్

ప్రజా వాయిస్ మిరుదొడ్డి



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 240 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గ్రూజూ) ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, మంత్రివర్యులకు, తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి, రాయపోల్ మండలాల్లో నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొని కృషి చేసిన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.రైతులకు సహకార సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వ్యవసాయ రంగానికి అవసరమైన సేవలు సులభంగా అందించేందుకు నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు దోహదపడుతుందని, ఈ నిర్ణయం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందని పాతూరి వెంకటస్వామి గౌడ్ పేర్కొన్నారు.



కేసీఆర్ మళ్లీ సీఎం కావాలనే ఆకాంక్షతో పాదయాత్ర

- దౌల్తాబాద్‌లో పాదయాత్రకు స్వాగత

పలికిన రణం శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు

దౌల్తాబాద్, నవంబర్ 18:
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో ఏడుపాయల నుంచి ఎర్రవల్లి వరకు బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన పాదయాత్ర బుధవారం దౌల్తాబాద్ మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా రణం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ వంటి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నారని, ఆయన తిరిగి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో చేపట్టిన పాదయాత్రకు బీఆర్ఎస్ శ్రేణులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇందుప్రియాల్ సర్పంచ్ వీరమ్మ, స్వాతి స్వామి, మాజీ సర్పంచులు శివకుమార్, వేమ జనార్దన్, మాజీ ఎంపీటీసీ వీరమ్మ, మల్లేశం, నాయకులు సుధాకర్ రెడ్డి, నరసింహులు, స్వామి, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు మండలంలో 483 మందికి చేయూత పింఛన్ల పంపిణీ

పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే



ప్రజా వాయిస్ షాద్‌నగర్)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండల కేంద్రంలోని రైతు వేదికలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులకు చేయూత పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కొందుర్గు మండలానికి మొత్తం 483 పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు.పర్వతాపూర్ గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన వారిని గుర్తించి పింఛన్లు అందేలా ప్రత్యేక చొరవ చూపిన గ్రామ సర్పంచ్ బోయ అశోక్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో అర్హులైన 16 మందికి చేయూత పింఛన్లు మంజూరు కావడంపై సర్పంచ్ బోయ అశోక్ హర్షం వ్యక్తం చేశారు. అర్హులకు పింఛన్లు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఆజాం అలీ, ఎంపీడీవో శ్రీరాములు, పీఏసీఎస్ చైర్మన్ అనిత జితేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, చేయూత పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



స్వయం ఉపాధితోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

జిన్నారం ప్రజావాయిస్
స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటూ వ్యాపార రంగంలో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రీ స్టార్స్ హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యజమానులు బేగంపేట శ్రీను, పుర్ర శేఖర్, మహ్మద్ ఫిరోజ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటారెడ్డి, ఉపసర్పంచ్ మహ్మద్ పాషా, యాదిరెడ్డి, నాయకులు నక్క వెంకటేష్ గౌడ్, భార్గవ్ చారి, సందీప్ గౌడ్, అంజద్ ఖాన్, అంజిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాల్ రెడ్డి, కాంతారావు, వెంకటేష్, భాస్కర్ గౌడ్, రమణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేటి “ ఛలో సిద్దిపేట ”ను జయప్రదం చేయాలి..

- ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి
- ఇందిరమ్మ కుటుంబ బీమా, రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభోత్సవానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పిలుపు



ప్రజా వాయిస్ /దుబ్బాక :
ఛలో సిద్దిపేట రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సభలో ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు, రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలు, మహిళలు, రైతులు, కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలనకు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తున్నాయని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.